https://prajakalam.com

RNI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

మంగళవారం | 03-03- 2025 | సంపుటి: 15 , సంచిక: 334 | నిజామాబాద్ | పేజీలు : 12, | వెల : 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

Circulated to Hyderabad,Ranagareddy,Nizamabad, Warangal, Mulugu, Shadnagar, Yadadri, Nalgonda, karimnagar, khammam, Medak, Sangareddy, Siddipet, Medchal, Jagityal,Vemulawada



ప్రజా కలం

Digital Editions

http://prajakalam.com

epaper.prajakalam.com

paperboy.com

www.magzter.com


## తెలంగాణ ప్రాజెక్టులకు వేగంగా

# అనుమతులు ఇప్పించండి



**గోదావరిలో నికర జలాల కేటాయింపులు జరగనప్పుడు**

**అదనపు జలాలను వినియోగించుకుంటామనడం సరికాదు**

**లెక్కలు తేలేది పూర్తిస్థాయి కేటాయింపులు జరిగిన తర్వాతే..**

**గతంలో జరిగిన పొరపాటు వల్ల తెలంగాణకు అన్యాయం**

**గోదావరిలో తెలంగాణ నికర వాటా తేల్చాల్సిందే: సీఎం**

న్యూఢిల్లీ, మార్చి 3: "తెలంగాణ ప్రాజెక్టులపై అభ్యంతరాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఏపీ సర్కారు కేంద్రంతో మాట్లాడి తెలంగాణ ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇప్పించాలి. తెలంగాణకు నీటి కేటాయింపులు జరగకుండా, రాష్ట్ర ప్రాజెక్టుల భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉన్నంత వరకూ వరద జలాలపై ఏపీ ప్రాజెక్టులకు అభ్యంతరం తెలుపుతాం. ఈ విషయంలో ఎటువంటి శషబిషలకు తావులేదు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గోదావరిపై తెలంగాణ నిర్మిస్తున్న ప్రాజెక్టులకు అనుమతులన్నీ వచ్చిన తర్వాత మిగతా వాటిపై ఏ నిర్ణయం తీసుకున్నా తెలంగాణ ప్రభుత్వానికి అభ్యంతరం లేదని తేల్చి చెప్పారు. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులన్నీ వచ్చిన తర్వాతే ఏపీ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సోమవారం దాదాపు గంటపాటు సమావేశమయ్యారు. అనంతరం, మీడియాతో మాట్లాడారు. ఇటీవలే ప్రధాని మోదీని కలిసి గోదావరిపై ప్రాజెక్టులు, జలాల అనుసంధానం తదితర అంశాలపై వివరించాననే విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. "కృష్ణా నదీ పరీవాహకంలో సుమారు 70 శాతం తెలంగాణలో ఉంటే 30 శాతం మాత్రమే ఆంధ్రప్రదేశ్‌లో ఉంది. అందుకే, కృష్ణా జలాల్లో 70 శాతం వాటా తెలంగాణ రాష్ట్రానికి కేటాయించాలి" అని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధమైన వాటా కేటాయించాలని కోరారు. తెలంగాణ వాటా నికర జలాలను తేల్చిన తర్వాతే గోదావరిపై ఏపీ నిర్మిస్తున్న ప్రాజెక్టులపై నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణా పరీవాహక ప్రాంతం తెలంగాణలో ఎక్కువగా ఉన్నప్పటికీ కేఆర్ఎంబీ పక్షపాత ధోరణితో ఏపీకి 66 శాతం, తెలంగాణకు 34 శాతం నీటిని కేటాయించిందని, ఫలితంగా, అనేక సంవత్సరాలుగా తాము నష్టపోతున్నామని, ఈ ఏడాది సైతం తమకు కేటాయించిన మొత్తానికి మించి నీటిని ఏపీ తరలించుకుపోతోందని ఆరోపించారు. ఇకపై ఏపీ తనకు కేటాయించిన వాటాకు మించి కృష్ణా నీటిని తరలించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

తరువాయి 2వ పేజీలో...

## జడ్జి పదవులకు

# అంధులు అర్హులే

**ఎలాంటి వివక్ష ఉండకూడదు: సుప్రీంకోర్టు స్పష్టీకరణ**

న్యూఢిల్లీ, మార్చి 3: జడ్జి పదవులకు అంధులు అర్హులేనని సోమవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వారి పట్ల ఎలాంటి వివక్ష ఉండకూడదని పేర్కొంది. అంధులు జడ్జి ఉద్యోగాలకు అర్హులు కారన్న నిబంధనను కొట్టివేస్తూ జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం ఈ మేరకు తీర్పును వెలువరించింది. మధ్యప్రదేశ్ జ్యుడీషియల్ సర్వీసెస్ నిబంధనల్లోని రూల్- 6ఏ ప్రకారం అం??ధత్వం ఉన్నవారు న్యాయాధికార పరీక్షలు రాయడానికి వీల్లేదు. ఈ కారణంగా అంధుడైన తన కుమారుడు పరీక్ష రాయలేకపోయాడని పేర్కొంటూ ఆయన తల్లి అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌కు లేఖ రాశారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. ఆ రూల్ వివక్షాపూరితంగా ఉందని పేర్కొంటూ కొట్టివేసింది. దివ్యాంగుల హక్కుల చట్టం- 2016లోని నిబంధనల ప్రకారం అలాంటి వ్యక్తులకు తగిన సదుపాయాలు కల్పించాలని ఆదేశించింది. జడ్జీల పదవులకు అంధులు అర్హులేనని గతంలో సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. ఆ మేరకు రాజస్థాన్, తమిళనాడుల్లో నియామకాలు జరిగాయి.

**పోస్టులను తొలగించే ముందు నోటీసు ఇవ్వాల్సిందే!**

సోషల్ మీడియాలో అభ్యంతకర పోస్టులను తొలగించడానికి ముందు.. సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇవ్వాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఐటీ నిబంధనలు-2009ని సవాలు చేస్తూ దాఖలైన ఓ ప్రజాహిత వ్యాజ్యం(పిల్)పై విచారణ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మాసిహల ధర్మాసనం..



ఎవరైనా సోషల్ మీడియాలో ఏదైనా సమాచారాన్ని పోస్టు చేస్తే.. దాన్ని తొలగించే ముందు వారి వాదనలను వినాలని భావిస్తున్నట్లు వెల్లడించింది. 'సాఫ్ట్‌వేర్ ఫ్రీడమ్ లా సెంటర్' అనే సంస్థ ఈ పిల్‌ను దాఖలు చేయగా.. సీనియర్ న్యాయవాది ఇందిరాజైసింగ్ వాదనలను వినిపించారు.

"ఐటీ చట్టంలోని సెక్షన్ 69(ఏ) ప్రకారం.. సామాజిక మాధ్యమాల నుంచి సమాచారాన్ని తొలగించే అధికారం ప్రభుత్వానికి ఉంది. అయితే.. ఆ సమాచారాన్ని పోస్టు చేసిన వ్యక్తికి నోటీసులు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఐటీ నిబంధనలు-2009లోని రూల్-8లో 'వ్యక్తి' అనే పదాన్ని సరిగ్గా నిర్వచించలేదు. రూల్-16 ప్రకారం ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతూ.. చర్యలు తీసుకోవాలి. కానీ, ప్రభుత్వం వ్యక్తులకు కాకుండా.. 'ఎక్స్' వంటి సామాజిక మాధ్యమ సంస్థలకు మాత్రమే నోటీసులు ఇస్తూ.. కంటెంట్‌ను తొలగిస్తోంది" అని వివరించారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో

# విరబూసిన కమలం

**ఉపాధ్యాయుల ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య**

**- మొదటి ప్రాధాన్య ఓట్లతోనే ఘన విజయం**

**- రెండో స్థానంలో నిలిచిన పీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి**

**- పట్టభద్రుల స్థానంలో కొనసాగుతున్న ఉత్కంఠ - పూర్తికాని చెల్లని ఓట్ల విభజన**

**- నేటి మధ్యాహ్నం వరకు ట్రెండ్స్ వెల్లడయ్యే అవకాశం**

కరీంనగర్, మార్చి 3 : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కమలం విరబూసింది. బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య మొదటి ప్రాధాన్య ఓట్లతోనే ఘన విజయం సాధించారు. ఆయన తన సమీప పీఆర్టీయూ బలపరిచిన అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిపై 5,777 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. బీజేపీ మాత్రమే ఈ స్థానంలో అభ్యర్థిని పోటీలో నిలుపగా మిగతా పార్టీలు దూరంగా ఉన్నాయి. 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నా ప్రధానంగా బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యకు పీఆర్టీయూ బలపరిచిన వంగ మహేందర్‌రెడ్డి గట్టి పోటీనిచ్చారు. నియోజకవర్గంలో 27,088 మంది ఓటర్లు ఉండగా 25,041 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ రాత్రి 9 గంటలకు ముగిసింది. నియోజకవర్గంలో 27,088 మంది ఓటర్లు ఉండగా 24,968 మంది మరో 73 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం



పోలైన 25,041 ఓట్లు పోల్‌కాగా 897 ఓట్లు చెల్లకుండా పోయాయి. 24,144 ఓట్లు చెల్లుబాటు కాగా అభ్యర్థి గెలుపొందడానికి 12,081 కోటా ఓట్లుగా గుర్తించారు. బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య

తరువాయి 2వ పేజీలో...

# రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి

**టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్**




హైదరాబాద్, మార్చి 3 (ప్రజాకలం ప్రతినిధి):

బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందాల్లో భాగంగానే రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారని టీపీసీసీ చీఫ్ మహేషకుమార్‌గౌడ్ ఆరోపించారు. గాంధీభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేషకుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణపై నిత్యం విషం చిమ్ముతున్న కిషన్‌రెడ్డి.. రాష్ట్రాభివృద్ధిని సైంధవుడిలా అడ్డుకుంటున్నారన్నారు. రాష్ట్రానికి చెందిన ఆ పార్టీ 8 మంది ఎంపీలు.. తెలంగాణ అభివృద్ధిపై ఏనాడైనా ప్రధాని మోదీని కలవడంగానీ.. కేంద్రాన్ని ఒప్పించి నిధులు తీసుకురావడం కానీ చేశారా.. అంటూ నిలదీశారు. కేంద్రం వైఖరితో మెట్రో విస్తరణ పనులూ నత్త నడకన సాగుతున్నాయని ఆరోపించారు. మూసీ ప్రక్షాళనకూ కేంద్రం నుంచి సహకారం అందట్లేదన్నారు. వరంగల్ మామునూరు విమానాశ్రయం గురించీ బీజేపీ నేతలు రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. మామునూరు విమానాశ్రయానికి గత కేసీఆర్ ప్రభుత్వం సహకరించలేదని బీజేపీ కేంద్ర మంత్రులే చెప్పారని, ఇప్పుడు తమ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంటే రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఆదిలాబాద్, భద్రాచలం, నిజామాబాద్ విమానాశ్రయాల మంజూరు ఇంకా పెండింగ్‌లోనే ఉందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి గురించి ఎందుకు పట్టించుకోవట్లేదంటూ కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని ఆశిస్తున్న రఘునందన్‌రావు.. తన పాచికలు పారకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ఆ గందరగోళంలో రాష్ట్రంలో పాలన పడకేసిందంటూ నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. పింక్ బుక్కు అంటున్న కవిత.. అందులో మొదట బీఆర్ఎస్ పార్టీ నేతల స్కామ్‌ల గురించే రాసుకోవాలని సూచించారు.

## ఎస్ఎల్‌బీసీ సహాయక చర్యలు..

# కన్వేయర్ బెల్టుకు మరమ్మతులు

**- 5 చోట్ల కొనసాగుతున్న తవ్వకాలు.. టీబీఎంను కట్ చేస్తేనే చివరకు**



అచ్చంపేట : ఉబికివస్తున్న ఊట నీరు.. 5-10 మీటర్ల వరకు పేరుకుపోయిన బురద మట్టి.. టీబీఎం యంత్రాన్ని కట్ చేశాక, బయటకు తీసుకువచ్చే ఏర్పాట్లు లేకపోవడం.. బురదను బయటకు తరలించే కన్వేయర్ బెల్ట్‌కు మరమ్మతులు.. వెరసి నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదస్థలిలో సహాయక చర్యలకు అడుగడుగునా ఆటంకాలేర్పడుతున్నాయి. ప్రమాదం జరిగి 10 రోజులు అవుతున్నా.. గల్లంతైన 8 మంది జాడ తెలియడం లేదు. ఉపగ్రహ సెన్సర్‌తో ఐదు చోట్ల బురదలో మెత్తటి అవశేషాల జాడను గుర్తించినా.. అక్కడ తవ్వకాలు కొనసాగుతూనే ఉన్నాయి. టీబీఎంను పూర్తిగా కట్‌చేసి, శకలాలను తొలగిస్తేనే.. టన్నెల్ చివరకు చేరుకునే అవకాశాలున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు బురద తొలగింపును వేగవంతం చేసేందుకు కన్వేయర్ బెల్ట్ మరమ్మతులకు 8మంది సింగరేణి ఇంజనీర్లు, ఫిట్టర్లు అహరహం శ్రమిస్తున్నారు. యంత్రాల సాయంతో టన్నెల్‌లోని నీటిని తోడే ప్రయత్నాలను వేగవంతం చేయగా.. మరో ఎక్స్‌కవేటర్‌ను లోనికి పంపేందుకు యత్నిస్తున్నట్లు అధికారులు వివరించారు. కాగా, సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మంది సిబ్బందిని రక్షించడానికి అన్నిరకాల సహాయ చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం హైకోర్టుకు నివేదించింది. నేషనల్ యూనియన్ ఫర్ మైగ్రెంట్ వర్కర్స్ సంస్థ దాఖలు చేసిన పిల్‌పై విచారణ సందర్భంగా ఈ మేరకు ఏజీ సుదర్శన్ రెడ్డి వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం..ప్రస్తుత దశలో ఈ అంశంపై విచారణ చేపట్టడం సమంజసం కాదని తెలిపింది. విచారణను ముగిస్తున్నట్లు పేర్కొంది.

## మార్చి చివరి వారంలో

## చిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు

**- సీఎంతో చర్చించి సమస్య పరిష్కరిస్తాం**

**- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హామీ**

హైదరాబాద్ : రాష్ట్రంలోని చిన్న కాంట్రాక్టర్లను ఆదుకుంటామని, పెండింగ్ బిల్లులపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని కాంట్రాక్టర్లకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భరోసానిచ్చారు. సోమవారం బిల్డర్స్ అసోసియేషన్ మాజీ చైర్మన్లు డి.వి.ఎన్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, చిన్న కాంట్రాక్టర్లు కొంతమంది మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించారు. చిన్న కాంట్రాక్టర్లకు సంబంధించి రూ.100 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఏళ్ల తరబడి బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్టు మంత్రికి తెలిపారు. కొత్త పనులు కూడా చేయలేకపోతున్నామని వివరించారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. చిన్న కాంట్రాక్టర్ల బిల్లుల విషయంపై సీఎంతో చర్చించి, ఈనెల చివరి వారంలో బిల్లులు చెల్లించేలా చూస్తామని హామీనిచ్చారు. అయితే పెండింగ్ బిల్లులు రావడంలేదన్న కారణంగా ప్రస్తుతం నడుస్తున్న పనుల్లో జాప్యం ఉండకూడదని మంత్రి సూచించారు. ప్రజలకు రహదారులే ప్రాథమిక అవసరమని, కాంట్రాక్టర్లు ఈ విషయాన్ని మరవకూడదని, దానిని దృష్టిలో ఉంచుకుని పనులు చేయాలన్నారు.

# కృష్ణమ్మ ఒడికి గోదావరి జలాలు



**- సీతారామ ఎత్తిపోతల పథకాల నుంచి.. ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు నీరు**

**- నీటిని విడుదల చేసిన మంత్రి తుమ్మల**

ఖమ్మం మార్చి 3: గోదావరిపై నిర్మించిన సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉన్న బీజీ కొత్తూరు, పూసూరు, కమలాపురం ఎత్తిపోతల పథకాల నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం నీటిని విడుదల చేశారు. దీంతో ఏన్కూర్ సమీపంలోని రాజీవ్ కాల్వ నుంచి వైరా రిజర్వాయర్‌కు మంగళవారం రాత్రికి గోదావరి జలాలు చేరబోతున్నాయి. గత ఏడాది ఆగస్టు 15న సీఎం రేవంత్‌రెడ్డి సీతారామ ఎత్తిపోతల లిఫ్టులతో పాటు ఏన్కూరు లింక్ కెనాల్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే వానాకాలంలో సాగర్ నీరు రావడంతో అప్పుడు గోదావరి జలాల అవసరం రాలేదు. యాసంగిలో సాగర్ ఆయకట్టుకు నీటి కొరత నెలకొంది. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి వద్ద గోదావరి జలాలను పరిశీలించారు. అనంతరం బీజీ కొత్తూరు, కమలాపురం, పూసూరు ఎత్తిపోతల పథకాలను సందర్శించి జలాలను విడుదల చేశారు. ఈ నీళ్లు ఏన్కూరు రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా మంగళవారం రాత్రి వైరా రిజర్వాయర్‌కు చేరుకుని అక్కడి నుంచి సాగర్ ఎడమ కాలువ ద్వారా ఆయకట్టుకు అందనున్నాయి.

# తెలంగాణ ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇప్పించండి

మొదటి పేజీ తరువాయి...

కృష్ణా ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు సంబంధించి వెంటనే టెలిమెట్రీ యంత్రాలను ఏర్పాటు చేయాలని, అవసరమైతే అందుకయ్యే మొత్తాన్ని తామే భరిస్తామని పునరుద్ఘాటించారు. "పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 2022లోనే డీపీఆర్ సమర్పించాం. అయినా, అనుమతులు ఇవ్వడానికి ఆలస్యం చేస్తున్నారు. అలాగే, సీతారామ ఎత్తిపోతలు, సమ్మక్క సాగర్ బ్యారేజీలకు కూడా అనుమతులు ఇవ్వలేదు. కానీ, న్యాయస్థానాల పరిధిలో ఉన్న అప్పర్ భద్రకు మాత్రం అనుమతులు ఇచ్చారు. సీతారామ, సమ్మక్క సాగర్‌లకు సీడబ్ల్యూసీ, సాంకేతిక సలహా మండలి అనుమతులు ఇప్పించాలి" అని కోరారు. పునర్విభజన చట్టం నిబంధనలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం బనకచర్ల పథకానికి రూపకల్పన చేసిందని, దీనికి సీడబ్ల్యూసీ, జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీ అనుమతుల్లేవని తెలిపారు. అపెక్స్ కౌన్సిల్లోనూ దీనిపై ఎటువంటి చర్చ జరగలేదని గుర్తు చేశారు. గోదావరిలో తెలంగాణ నికర జలాల వాటా తేల్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాపాడుకునే విషయంలో ఏమాత్రం రాజీపడబోమని కేంద్ర మంత్రికి తేల్చి చెప్పారు. పాలమూరు, సీతారామ, మొడికుంటవాగు, చనాఖా కొరటా, చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర) ఎత్తిపోతల పథకాలకు ఏఐబీపీ కింద ఆర్థిక సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తామని, ముంపునకు సంబంధించి మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

**అదనపు జలాలను వాడుకుంటామనడం సరికాదు**

సమ్మక్క సాగర్, సీతారామ సహా ఇతర ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపులే జరగలేదని, అలాంటప్పుడు గోదావరిలో అదనపు నీళ్లున్నాయని, సముద్రంలో కలిసే ఆ నీళ్లను ఉపయోగించుకుంటామని ఆంధ్రప్రదేశ్ చెప్పడం సరికాదని సీఎం రేవంత్ మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. "తెలంగాణలో శాశ్వత ప్రాజెక్టులకు పూర్తిస్థాయి కేటాయింపులు జరిగిన తర్వాతే.. వరద జలాలు ఉన్నాయా? లేదా అనేది లెక్క తేలుతుంది. గోదావరిపై నిర్మిస్తున్న తెలంగాణ ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు పూర్తయిన తర్వాతే ఇతర ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలి. సమ్మక్క బరాజ్, సీతారామ ప్రాజెక్టులకు సీడబ్ల్యూసీ తుది అనుమతి రాలేదు. వాటిపై ఏపీ అభ్యంతరాలు చెబుతోంది. సముద్రంలో కలుస్తున్న గోదావరి వరద జలాలను బనకచర్ల ద్వారా కృష్ణా బేసిన్‌కు తరలిస్తామని చెబుతోంది. అలాంటప్పుడు తెలంగాణ ప్రాజెక్టులపై ఎందుకు అభ్యంతరాలు చెబుతోంది" అని ప్రశ్నించారు. గతంలో జరిగిన పొరపాటు కారణంగా కృష్ణా జలాల్లోని 811 టీఎంసీల్లో ఏపీ 512 టీఎంసీలు వినియోగిస్తుంటే.. తెలంగాణ కేవలం 299 టీఎంసీలకే పరిమితమైందని, తెలంగాణ ప్రాజెక్టులు పూర్తికాకపోవడమే దీనికి ప్రధాన కారణమని చెప్పారు. గోదావరి వరద జలాల లెక్క తేలిన తర్వాత తమ ప్రాజెక్టులకు సంబంధించి ఏపీ డీపీఆర్‌లు ఇవ్వాలని, వాటిపై చర్చ జరిపి తమ అభ్యంతరాలను చెబుతామని తెలిపారు. కృష్ణా నది విషయంలో ఏ సమస్యనైతే ఎదుర్కొంటున్నామో, అలాంటి సమస్యనే గోదావరి విషయంలోనూ ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా లేమని తేల్చి చెప్పారు.

**నేటి నుంచి మీనాక్షి సమీక్షలు**

హైదరాబాద్, మార్చి 3: క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పరిస్థితిపై అవగాహన, పార్టీ నేతలకు దిశానిర్దేశం చేసేందుకు మంగళవారం నుంచి లోక్ సభ నియోజకవర్గాల వారీగా పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సమీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గాంధీభవన్‌లో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మెదక్, సాయంత్రం 5 గంటలకు మల్కాజ్‌గిరి నాయకులతో ఆమె భేటీ కానున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు కరీంనగర్, మధ్యాహ్నం 2 గంటలకు ఆదిలాబాద్, సాయంత్రం 5 గంటలకు పెద్దపల్లి నేతలతో భేటీ కానున్నారు.

**ఏపీకి అడ్డుకట్ట వేయాలి: మంత్రి ఉత్తమ్**

కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని, నీటి తరలింపుపై కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరామని, తప్పకుండా జోక్యం చేసుకుంటామని సీఆర్ పాటిల్ హామీ ఇచ్చారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. సాగర్ కుడి కాల్వ ద్వారా ఏపీ తీసుకెళుతున్న 10 వేల క్యూసెక్కుల నీటిని 5 వేల క్యూసెక్కులకు తగ్గించాలని కోరామని, ఇందుకు కూడా అంగీకరించారని తెలిపారు. "బనకచర్ల ప్రాజెక్టు కోసం ఏపీ సీఎం చంద్రబాబు ప్రతిపాదన పెట్టారు. దానిపై మేం అభ్యంతరం తెలిపాం. ప్రాజెక్టుపై కేంద్రం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. మాకు ఫీజిబిలిటీ, డీపీఆర్ వంటివేమీ రాలేదని, ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర మంత్రి తెలిపారు" అని వివరించారు. 811 టీఎంసీల కృష్ణా జలాల్లో తెలంగాణకే ఎక్కువ వాటా ఉండాలని కోరామని, పాలమూరు, సీతారామ, సమ్మక్క సాగర్ నీటి కేటాయింపులను త్వరగా పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. కాళేశ్వరం బరాజ్‌లు కుప్పకూలడానికి సంబంధించి ఎన్డీఎసఏ విచారణ జరుగుతోందని, దీనిపై త్వరగా నివేదిక తమకు ఇవ్వాలని కోరామని, దాని ఆధారంగానే ముందుకు వెళ్లాలని నిర్ణయించామని స్పష్టం చేశామని వివరించారు. అన్నింటికీ కేంద్రం మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. సమావేశంలో నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, కేంద్ర జలశక్తి కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, రాష్ట్ర నీటి పారుదల శాఖ ఈఎన్సీ (ఓఅండ్ఎం) విజయ్ భాస్కర్ రెడ్డి, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

**ఎమ్మెల్సీల అంశం తేలగానే మంత్రివర్గ విస్తరణ?**

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక పూర్తి కాగానే.. మంత్రివర్గ విస్తరణపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టనున్నారా? బడ్జెట్ సమావేశాల విరామ సమయంలో దీనికి సంబంధించి కసరత్తు జరగనుందా? ఈ నెలాఖరు కల్లా ఆ కసరత్తు ఓ కొలిక్కి రానుందా? బడ్జెట్ సమావేశాల తర్వాత కొత్త మంత్రులు కొలువుదీరనున్నారా? ఈ ప్రశ్నలకు కాంగ్రెస్ పార్టీ వర్గాలు.. అవుననే సమాధానమే ఇస్తున్నాయి. మరో మూడు, నాలుగు రోజుల్లో ఎమ్మెల్సీ అభ్యర్థులు ఖరారు కానున్నారని.. ఆ తర్వాత సామాజిక సమీకరణలు, ఇతర అంశాల ఆధారంగా మంత్రి వర్గ విస్తరణ కసరత్తు జరగనుందని ఆ వర్గాలు చెబుతున్నాయి. అయితే శాఖల మార్పులతో సరిపెడతారా... లేక ఒకరిద్దరిని మార్చి కొత్తవారిని నియమిస్తారా అన్నదానిపై స్పష్టత లేదు. కాగా, ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక కూర్పు.. మంత్రివర్గ విస్తరణ కసరత్తుపై ప్రభావం చూపే అవకాశమున్నట్లు చెబుతున్నారు. అసెంబ్లీలో కాంగ్రెసకున్న సంఖ్యా బలాన్ని బట్టి 4 ఎమ్మెల్సీ సీట్లు దక్కనున్న సంగతి తెలిసిందే. ఈ 4 సీట్లలో ఒక సీటు అగ్రకులానికి, ఒకటి ఎంబీసీలకు, ఎస్సీ మాదిగ, ఎస్సీ మాలకు చెరో సీటు కేటాయించనున్నట్లుగా పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఎస్సీ మాదిగ నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. ఆయనతోపాటు దొమ్మాటి సాంబయ్య, రాచమళ్ల సిద్ధేశ్వర్ రేసులో ఉన్నారు. ఎస్సీ మాల నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. ఓసీల్లో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, టీపీసీసీ నేత జెట్టి కుసుమ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ రేసులో మిగిలారు. ఎంబీసీల నుంచి సీనియర్ నేతల పేర్లను పరిశీలిస్తున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీపీఐకి ఒక సీటు కేటాయించాల్సి వస్తే మళ్లీ సమీకరణలు మారతాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ఈ నెల 6వ తేదీ సాయంత్రంగానీ, 7న గానీ సీఎం రేవంత్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి భేటీఅయి.. 8వతేదీకల్లా అభ్యర్థులను ఖరారు చేయనున్నట్లు సమాచారం.

**విస్తరణా.. పునర్వ్యవస్థీకరణా?**

రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ పెంచుకునేందుకు వీలుగా రాజ్యాంగాన్ని సవరించాలంటూ కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు సీఎం రేవంత్ అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లనున్నారు. ఇందుకోసం బడ్జెట్ సమ్మాశాల మధ్యలో ఒక వారం పాటు విరామం ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. ఆ విరామ సమయంలో మంత్రివర్గ విస్తరణపై కసరత్తు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. అయితే మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించాలా.. లేక శాఖల మార్పుతో సరిపెట్టాలా అనే అంశంపై తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం. ఏడాది పాలనలో మంత్రుల పనితీరుపై అధిష్ఠానం ఇప్పటికే నివేదిక తెప్పించుకుంది. వారిలో ఆశించిన పనితీరు కనబరచని ఒకరిద్దరు మంత్రుల స్థానే కొత్తవారికి అవకాశం ఇవ్వాలా.. లేక వారి శాఖలను మార్చాలా అన్నదానిపై పరిశీలన జరుగుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం మంత్రివర్గంలో ఆరు బెర్తులు ఖాళీగా ఉన్న సంగతి తెలిసిందే. అయితే ముదిరాజ్ సామాజిక వర్గ నేతను మంత్రిని చేస్తామంటూ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్ ప్రకటించిన నేపథ్యంలో.. పార్టీలో ఆ సామాజిక వర్గం నుంచి ఉన్న ఏకైక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దాదాపు ఖరారైంది. అలాగే ఉమ్మడి నిజామాబాద్ నుంచి సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి కోసం సీఎం రేవంత్‌రెడ్డి పట్టుపడుతున్నారు. అయితే రెడ్డి సామాజిక వర్గం నుంచి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి రామ్మోహన్‌రెడ్డి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం.. సోషల్ ఇంజనీరింగ్‌కు ప్రాధాన్యమిస్తున్న నేపథ్యంలో విస్తరణలో రెడ్డి సామాజిక వర్గానికి ఒక సీటే కేటాయిస్తే.. ఈ ముగ్గురి ఆశలూ గల్లంతైనట్లేనంటున్నారు. పరిగి రామ్మోహన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డిలో ఒకరికి చీఫ్‌విప్ పదవి దక్కనున్నట్లు చెబుతున్నారు. ఇక.. వర్గీకరణ అంశం తెరపైకి వచ్చాక ఎస్సీ మాదిగ, మాల వర్గాల మధ్య పోటీ మరింత తీవ్రమైంది. మాల సామాజిక వర్గం నుంచి గడ్డం వివేక్ పోటీ పడుతుండగా.. మాదిగ సామాజిక వర్గం నేతలూ క్యాబినెట్లో బెర్తు కోసం పట్టు పడుతున్నారు. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి వివేక్‌తో పాటు ప్రేమ్‌సాగర్‌రావు కూడా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ఇక ముదిరాజ్ సామాజికవర్గంతో పాటు మరో బీసీ సామాజిక వర్గానికీ విస్తరణలో చోటు కల్పించాలంటూ బీసీ వర్గాల నేతలు ఒత్తిడి తెస్తున్నారు. ఎస్టీ లంబాడా వర్గం నుంచి బాలూనాయక్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించాలా.. లేక డిప్యూటీ స్పీకర్‌గా నియమించాలా అన్నదానిపై చర్చలు జరుగుతున్నాయి. ముస్లింల నుంచి పార్టీ సీనియర్ నేతలు ఎవరూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లేరు. ఎమ్మెల్సీ అమెరలీఖాన్‌కు మంత్రి పదవి ఇచ్చేంత సీనియారిటీ లేదు. క్యాబినెట్ ర్యాంకుతో షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారుగా నియమించిన నేపథ్యంలో ఈ వర్గానికి మంత్రి వర్గంలో చోటు కల్పించాలా.. వద్దా అనే చర్చా నడుస్తోంది. అయితే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణను నమూనాగా చూపాలని భావిస్తున్న పార్టీ అధిష్ఠానం.. రానున్న నాలుగేళ్లూ మంత్రుల పనితీరుకే ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి వర్గ విస్తరణలో అధిష్ఠానం తన మార్కు చూపించే ఆస్కారం ఉందంటున్నారు.

## గొత్తికోయ గూడెంలో వైద్య శిబిరం

### వేసవిలో తగు జాగ్రత్తలు పాటించాలి - డాక్టర్ చీర్ల శ్రీకాంత్



వెంకటాపూర్ (రామప్ప) ,మార్చి 3, ప్రజా కలం:

సోమవారం రోజున అడవి ప్రాంతంలో నివసిస్తున్న గొత్తి కోయలు వేసవికాలంలో తగు జాగ్రత్తలు పాటించాలని వెంకటాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చీర్ల శ్రీకాంత్ అన్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం కేంద్రం శివారు అడవి ప్రాంతంలో ఎనిమిది కిలోమీటర్లు దూరంలో నివసిస్తున్న గొత్తి కోయ గూడెంలో సోమవారం స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చీర్ల శ్రీకాంత్ వైద్య సిబ్బందితో కలిసి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గూడెంలో నివాసం ఉంటున్న వారందరిని పరీక్షించి అవసరమైన 45 మందికి రక్త పరీక్షలు చేసి మందులను అందజేశారు. గర్భిణీలు, చిన్న పిల్లలకు అవసరమైన టీకాలను వేశారు. గూడెంలో దోమలు నిల్వ ఉండకుండా దోమల మందులు పిచికారి చేయించారు. అనంతరం డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ అడవి ప్రాంతంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని వాటి ద్వారా మలేరియా, డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. వేసవిలో డయేరియా ఎక్కువగా ఉంటుందని దానిని నివారించేందుకు కాచి వడపోసిన నీటిని తాగాలని సూచించారు. ఎవరికైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ఆరోగ్య కార్యకర్తను,గాని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో సంప్రదించి వైద్య సహాయం పొందాలన్నారు. అనంతరం వై ఆర్ జి కేర్ స్వచ్ఛంద సేవా సంస్థ సూపర్వైజర్ రజిని, లింక్ వర్కర్ స్వప్న హెచ్ఐవి ఎయిడ్స్ పై గొత్తి కోయలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి నవీన్, సిహెచ్ఓ దుర్గారావు, ఏఎన్ఎం లు అనురాధ స్వప్న, ఆశా కార్యకర్తలు సరోజన, మాధవి, సౌజన్య, ఇందిర, కవిత, సంపూర్ణ, శోభ, పాల్గొన్నారు.

## లక్ష్మీదేవి పేట పాఠశాలకు డిజిటల్ ప్రొజెక్టర్ అందించిన ప్రియనేస్తం ట్రస్ట్ ఫౌండర్ పింగిలి నాగరాజు


### ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి - పింగిలి నాగరాజు సేవలు అభినందనీయులు

### మధ్యాహ్న భోజన కార్మికులకు డ్రెస్ కోడ్ - పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించాలి

### ప్రభుత్వ పాఠశాలలో నమోదు శాతం పెంచాలి - వెంకటాపూర్ తహసిల్దార్ గిరిబాబు

వెంకటాపూర్ ( రామప్ప ),మార్చి 3 ,ప్రజా కలం:–

సోమవారం రోజున ప్రభుత్వ పాఠశాలలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వెంకటాపూర్ తహసిల్దార్ గిరిబాబు అన్నారు మండలంలోని లక్ష్మీదేవి పేట మండల ప్రజా పరిషత్ పాఠశాలకు నేస్తం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు పింగిలి నాగరాజు రూ.25000 లు విలువచేసే ఆల్ ఇన్ వన్ డిజిటల్ ప్రొజెక్టర్ను సోమవారం భోజన విరామ సమయంలో అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తాసిల్దార్ గిరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల కోసం నాణ్యమైన విద్యను అందించేందుకు పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తుందని అన్నారు. లక్ష్మీదేవి పేటలో ని పాఠశాలకు డిజిటల్ బోధన కోసం ఉపాధ్యాయులు కోరగానే ప్రియనేస్తం ట్రస్ట్ ఫౌండర్ పింగిలి నాగరాజు ప్రొజెక్టర్ను అందించడం అభినందనీయమని అన్నారు. ములుగు జిల్లాలో నిరుపేద విద్యార్థుల అభ్యున్నతి కోసం నాగరాజు చేస్తున్న సేవలు మరువలేనివని ఆయన కొనియాడారు. పాఠశాలలో చదివే విద్యార్థులు నిరుపేద కుటుంబాల నుంచి వచ్చే వారిని వారికి విలువలతో కూడిన విద్యను అందించి వారి అభివృద్ధికి కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా ఉపాధ్యాయులను కోరారు. పాఠశాలలో చదివే విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని ఇందుకుగాను ప్రతి పాఠశాలలో ఒక రిజిస్టర్ ఏర్పాటు చేసి అందులో వివరాలను నమోదు చేయాలని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో వెంకటాపూర్ మండలంలో ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు మధ్యాహ్నం భోజనము వండి పెట్ట మహిళలకు డ్రెస్ కోడ్ ఏర్పాటు చేస్తానని ఇందుకుగాను స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సహకరించాలని ఆయన కోరారు. ప్రియనేస్తం ట్రస్ట్ ఫౌండర్ పింగిలి నాగరాజు మాట్లాడుతూ లక్ష్మీదేవి పేట పాఠశాల దినదినం అభివృద్ధి చెందుతుందని విద్యార్థుల నమోదుకు ఉపాధ్యాయులు ఎంతగానో కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను



ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని ఆయన సూచించారు. తన వంతుగా విద్యార్థులకు ఎలాంటి అవసరం ఉన్న అవసరం తీర్చేందుకు తాను ముందు ఉంటానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల నమోదు శాతం పెంచడంలో కృషి చేస్తున్నారని అన్నారు. అందుకు నిదర్శనమే ఎంపీపీ ఎస్ లక్ష్మీదేవి పేట పాఠశాల అని ఆయన తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తున్నామని ప్రతిరోజు సాయంకాలం వ్యాయామ విద్యను సైతం ప్రోత్సహిస్తూ క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందిస్తున్నామని ఆయన తెలిపారు. తమ పాఠశాలలో చదివే విద్యార్థులు పాఠశాలకు రానిచో వారి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులను రెగ్యులర్గా పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగాపూర్ ప్రధానోపాధ్యాయులు ఎండి సర్వర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ విజేందర్, మాదిగ కార్యకర్త అలుగోది శ్రీకాంత్, సీనియర్ ఉపాధ్యాయులు సలేంద్రం, సాంబయ్య, అంగన్వాడీ టీచర్ మద్దెల సంధ్య, ఆయా స్వరూప విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

హైదరాబాద్, మార్చి 3: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం నుంచి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్న ఈ పరీక్షలకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య సోమవారం మీడియా సమావేశంలో తెలిపారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రతి కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి చెందిన ఏఎన్ఎం/ఆశా కార్యకర్తలను అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. హాల్ టికెట్‌కు సంబంధించి ఇప్పటికే విద్యార్థులందరికీ ఎస్ఎంఎసలు పంపామని, దానిపై క్లిక్ చేసి వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పరీక్ష కేంద్రాల కచ్చితమైన చిరునామా తెలిపేందుకు అన్ని హాల్ టికెట్‌లపై జీపీఎస్ లోకేషన్ ముద్రించామని, దీనిని స్కాన్ చేసి కేంద్రం వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. ఈసారి అన్ని ప్రశ్నపత్రాలపై ప్రత్యేక వరుస సంఖ్య(యునిక్ సీరియల్ ఐడీ) ముద్రించామని, దీంతో విద్యార్థులకు వెళ్లే ప్రశ్నపత్రం వివరాలు ముందే తెలుసుకోవచ్చన్నారు. ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, అనివార్య పరిస్థితుల్లో పరీక్షా సమయం కంటే 5 నిమిషాలు ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు.

### ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో

## విరబూసిన కమలం

మొదటి పేజీ తరువాయి...

మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులోనే కోటా ఓటుకు మించి ఓట్లు పోలయ్యాయి. దీంతో ఆయనను మొదటి ప్రాధాన్య ఓటుతోనే గెలుపొందినట్లుగా ప్రకటించారు. మల్క కొమురయ్యకు 12,959 ఓట్లు రాగా ఆయన సమీప పీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డికి 7182 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యకు పీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మరో అభ్యర్థి వై అశోక్‌కుమార్ మధ్య పోటీ ఉంటుందని అందరూ భావించగా అంచనాలను తారుమారు చేస్తూ కొమురయ్య మొదటి ప్రాధాన్య ఓట్లలోనే 5,777 ఆధిక్యంతో గెలుపొంది సంచలనం సృష్టించారు.

**ఫలించిన వ్యూహం**

బీజేపీ అధిష్ఠానం ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించి అనుకున్న ఫలితం సాధించింది. మిగతావారికంటే ముందుగా జనవరిలోనే అభ్యర్థులను ప్రకటించింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్క కొమురయ్య బరిలోకి దింపింది. ఆయన విజయం కోసం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, ఇతర నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఘన విజయం సాధించారు.

**కొనసాగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్ ప్రక్రియ**

కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో ఉదయం 8 గంటల నుంచి పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓట్ల లెక్కింపును ప్రారంభించారు. పట్టభద్రుల ఓట్లను లెక్కించేందుకు 21 టేబుళ్లను, ఉపాధ్యాయ ఓట్లను లెక్కించేందుకు 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ముందుగా చెల్లిన ఓట్లు, చెల్లని ఓట్లను వేర్వేరు చేసే ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్లలో అధికంగా చెల్లని ఓట్లు కనిపించడం అభ్యర్థులను ఆందోళనకు గురిచేసింది. పట్టభద్రుల స్థానంలో 56 మంది అభ్యర్థులు పోటీ చేశారు. 2,50,106 ఓట్లు పోలయ్యాయి. వీటి నుంచి చెల్లిన, చెల్లని ఓట్లను వేరు చేసే ప్రక్రియ రాత్రి వరకూ పూర్తికాలేదు. చెల్లిన, చెల్లని ఓట్ల వేరు చేసే ప్రక్రియ పూర్తిచేసి 25 ఓట్లకు ఒక బెండల్‌ను కట్టి, ఆ తర్వాత ఓట్లను లెక్కిస్తారు.

25 చొప్పు ఓట్ల కట్టలు కట్టే ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం వరకు పూర్తయ్యే అవకాశముంది. ఆ తర్వాత నుంచే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కావచ్చని అంచనావేస్తున్నారు. చెల్లని ఓట్లతో ఫలితాలు తారుమారయ్యే అవకాశముంటుందని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థుల మధ్య హోరాహోరీగా సాగిన ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యఓట్లతో గెలుపు కష్టమేనని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో చెల్లని ఓట్లు ఎవరికి నష్టం కలిగిస్తాయో, ఎవరికి లాభం చేస్తాయో చెప్పలేని స్థితిలో అందరిలో టెన్షన్ మొదలైంది.

**పట్టభద్రుల స్థానాన్ని కూడా గెలుస్తాం: సంజయ్**

కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపుతో ప్రధాన ప్రతిపక్షం బీజేపీయే అని తేలిందని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ టీచర్ ఎమ్మెల్సీగా గెలుపొందిన మల్క కొమురయ్య ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్న అనంతరం ఆయన్ను బండి అభినందించారు. తపస్ చిన్న సంస్థ అని హేళన చేసిన వారికి చెంప పెట్టులా తీర్పు వచ్చిందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కై బీజేపీ అభ్యర్థి కొమురయ్యను ఓడించాలని కుట్రలు చేశాయన్నారు. కిషన్‌రెడ్డి నాయకత్వంలో ఇది మూడో విజయమన్నారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు, ఒక టీచర్ ఎమ్మెల్సీ గెలిచామని, పట్టభద్రుల స్థానాన్ని కూడా బీజేపీ కైవసం చేసుకుంటుందన్నారు. భవిష్యత్తులో ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. ఉపాధ్యాయ స్థానంలో ఎమ్మెల్సీగా గెలుపొందిన మల్క కొమురయ్య మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తల కృషి, తపస్ సహకారం వల్లే తాను గెలిచానన్నారు. ఉపాధ్యాయల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కాగా, రాష్ట్రంలో కులగణన నేపథ్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో బీసీ, బహుజన ఐక్యత నినాదంతో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, ఎస్.సుందర్‌రాజ్ బరిలో నిలిచారు. అయితే ఈ వాదాన్ని, నినాదాన్ని ఉపాధ్యాయవర్గం తేలిగ్గా తీసుకున్నట్లు స్పష్టమైంది. మాజీ ఎమ్మెల్సీ కూడా అయిన పూల రవీందర్ నాలుగో స్థానానికి పరిమితం కాగా, సుందర్‌రాజ్ ఆరో స్థానానికి పరిమితమయ్యారు.



గళం మీది కలం మాది

మీ ప్రాంతంలో ఏ సమస్యనైనా పరిష్కరించడానికి 'ప్రజాకలం' మీకు తోడుగా ఉంటుంది. మీ సమస్యల వివరాలను, ఫోటోలను మాకు వాట్సప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

జగిత్యాల: 94403 52123
పెద్దపల్లి :9849007793,9121348522
మెట్‌పల్లి : 95535 39999
రుద్రంగి : 86888 05981
బుగ్గారం : 99897 94948
గోదావరిఖని : 99899 35750
సిరిసిల్ల : 9014368563

◆ కరీంనగర్ ◆ జగిత్యాల ◆ పెద్దపల్లి ◆





ప్రజాకలం

◆ ఉమ్మడి కరీంనగర్ ◆

మంగళవారం, మార్చి 4, 2025




# గీత కార్మికునికి తీవ్ర గాయాలు

## - ప్రభుత్వ సహాయం కోసం విజ్ఞప్తి

పెద్దపల్లి,మార్చి 03:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

మండలంలోని పెద్దకల్వల గ్రామానికి చెందిన గీత కార్మికుడు భూషణవేణి రాజయ్య గత మాసం ఫిబ్రవరి 28న తాటి చెట్టు పై నుండి జారిపడి



తీవ్రంగా గాయపడ్డారు.కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం సోమవారం కుటుంబ సభ్యులు ఆయనను ఇంటికి తరలించారు.ప్రస్తుతం గీత వృత్తి చేయలేని స్థితిలో ఉన్న రాజయ్య కుటుంబ పోషణ భారంగా మారింది.ఈ నేపథ్యంలో గీత పారిశ్రామిక సహకార సంఘం నాయకులు స్పందిస్తూ, రాజయ్యను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.గీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగించే రాజయ్య,ప్రస్తుతం పని చేయలేని స్థితిలో ఉండడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది.ప్రభుత్వం,దాతలు స్పందించి తమను ఆదుకోవాలని రాజయ్య వేడుకుంటున్నారు.

# రెగ్యులర్ చేసుకునేందుకు ఎల్ ఆర్ ఎస్ అవకాశం

## మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ టీ మోహన్

మెట్ పల్లి: ప్రతినిధి మార్చి 03 (ప్రజా కలం) మున్సిపల్ పరిధిలో 2020 సంవత్సరంలో 1000 రూపాయలు చెల్లించి ఎల్ఆర్ఎస్ కొరకు రిజిష్టర్ చేసుకున్న ఫ్లాట్లు యజమానులకు అనుమతి లే అవుట్లలోని ఖాళీ ఫ్లాట్లను రెగ్యులరైజ్ చేసుకొనుటకు తెలంగాణ ప్రభుత్వం 2025 సం. మార్చి 31 వరకు సదవకాశాన్ని కల్పించిందని మున్సిపల్ కమిషనర్ టీ మోహన్ తెలిపారు. అనుమతి లేని లే అవుట్లలో ఫ్లాట్లు రిజిస్ట్రేషన్ అయి మిగతా కానీ, వాటిని కూడా సబ్ రిజిష్టర్ వారి కార్యాలయంలో రిజిస్ట్రేషన్ తో పాటు ఎస్ఆర్ఎస్ రుసుం కూడా చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని, మార్చి 31వ తేది లోపల ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించే వారికి రాయితీ కూడా ప్రకటించిందన్నారు. ఈ అవకాశం ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# వృద్ధురాలి ఇంటిలో చోరీ

## - 7 తులాల బంగారు ఆభరణాల అపహరణ



కాల్వశ్రీరాంపూర్,మార్చి03:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) కాల్వశ్రీరాంపూర్ మండలం చిన్నరాత్ పల్లి గ్రామంలో భారీ చోరీ జరిగింది.మద్దెల శాంతమ్మ అనే వృద్ధురాలి ఇంటిలో దాదాపు రూ.2 లక్షల 10 వేల విలువైన 7తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి.శాంతమ్మ తమ బంధువుల వివాహానికి వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది.దుండగులు ఇంటి తలుపులు పగులగొట్టి లోపల బీరువాలో ఉన్న లాకర్ ను తెరిచి బంగారాన్ని అపహరించారు.ఈ విషయమై శాంతమ్మ కాల్వశ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ లో సోమవారం ఫిర్యాదు చేశారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# బంగారు తల్లి ప్రేరణ కార్యక్రమం

ఎండపల్లి, మార్చి 03 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామం లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో బంగారు తల్లి ప్రేరణ కార్యక్రమం మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ కొలగాని నరేష్ వారి ఆధ్వ ర్యం లో నిర్వహించడం జరిగింది డాక్టర్ నరేష్ మాట్లాడుతూ విద్యా ర్థిని విద్యార్థులు అందరికీ వారి యొక్క భవిష్యత్తు ఏ విధంగా ఉండాలి స్టడీ స్కిల్స్ గురించి వివరిస్తూ ఉన్నత స్థానానికి ఏ విధంగా ఎదగాలి ఏ విధంగా చైతన్యం కావాలి భవిష్యత్తులో వారి దేశానికి సేవ చేయడానికి ముందుకు రావాలని మానవ నైతిక విలువలను పెంపొందించు కోవాలని పిల్లలను ఉద్దేశించి మాట్లాడారు పరీక్షల పట్ల భయాన్ని వీడి ఆత్మవిశ్వాసం తో ఎదుర్కో వాలని విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఎండపల్లి మండల విద్యాధికారి పాఠశాల ప్రధానోపా ధ్యాయులు గుండేటి రామచంద్రం మాట్లాడుతూ బంగారు తల్లి ఫౌండేషన్ వారు ఒక మంచి ప్రోగ్రామ్ ని నిర్వహించినందు కు మా పిల్లల తరఫున మా ఉపా ధ్యాయ బృందం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేసు కుంటూ ప్రస్తుతం ఉన్న విద్యార్థు లు ఏ విధంగా మార్పు వారి జీవితంలో తీసుకురావాలని ఇలాంటి కార్యక్రమాలు ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేయాలని కోరుకున్నారు ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఇంటర్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి




## - జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్

జగిత్యాల మార్చ్ 03 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి):

సోమవారం రోజున జిల్లా కలెక్టరేట్ లోనీ సమావేశ మందిరంలో చీఫ్ సూపరిండెంట్ ,డిపార్ట్మెంట్ ఆఫీసర్స్ , సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్, అధికారులతో ఇంటర్ పరీక్షల నిర్వహణ పై అదనపు కలెక్టర్ బి.ఎస్ లత తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 5 నుంచి మార్చి 25 వరకు ఇంటర్ పరీక్షల ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహణకు జిల్లాలో కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం 28, పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్స్ గాని స్మార్ట్ వాచ్లు అనుమతి లేదని అన్నారు. అన్ని పరీక్ష కేంద్రాలలో శానిటేషన్ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రాలో సీసీ టీవీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించబడతాయని అన్నారు. విద్యార్థులకు పరీక్ష హాల్స్ లో త్రాగు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ఫ్యాన్స్ లైటింగ్ వంటి ఏర్పాటు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి.ఎస్ లత జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి నారాయణ,సంబంధిత ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రంగులమయమైన గాయత్రి ఆనందోత్సవ్

## - అంబరాన్ని తాకిన గాయత్రి వార్షికోత్సవ సంబరాలు

పెద్దపల్లి,మార్చి 03:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు తమ ప్రతిభతో ఆర్య వైశ్య భవన్‌లో నిర్వహించిన ఆనందోత్సవం వార్షికోత్సవాన్ని రంగులమయం చేశారు.పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ వార్షికోత్సవ వేడుకలు ఆర్యవైశ్య భవన్‌లో ఘనంగా జరిగాయి.గాయత్రి విద్యాసంస్థల ఛైర్మన్ అల్లెంకి శ్రీనివాస్,కరస్పాండెంట్ రజనీ–శ్రీనివాస్,ప్రిన్సిపాల్ విజయ్, ముఖ్య అతిథి ప్రముఖ అక్షర గణిత అష్టావధాని పుల్లూరి ప్రభాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్ పాఠశాల వార్షిక నివేదికను చదివి,విద్యార్థుల విజయాలు, పాఠశాల లక్ష్యాలు,తల్లిదండ్రుల ప్రోత్సాహాలను వివరించారు.ముఖ్య అతిథి పుల్లూరి ప్రభాకర్ మాట్లాడుతూ గణితం మానవ జీవితంలో ఒక ముఖ్యమైన భాగమని, విద్యార్థుల జీవితంలో దాని ప్రాముఖ్యతను తెలియజేశారు.అనంతరం విద్యార్థులు చెప్పిన పదాలు,వాక్యాలలోని అక్షరాల సంఖ్యను తక్షణమే చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు.గాయత్రి విద్యాసంస్థల ఛైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా పాఠశాల విద్యార్థులను తీర్చిదిద్దడంలో సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థులు ప్రదర్శించిన జానపద నృత్యాలు,శాస్త్రీయ నృత్యాలు మరియు నాటకాలు ప్రేక్షకులను అలరించాయి.ప్రత్యేకంగా,సామాజిక సందేశాన్ని



అందించిన నాటకం అందరినీ ఆలోచింపజేసింది.ఈ వేడుకలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి.ఈ వార్షికోత్సవం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు,తల్లిదండ్రులకు ఒక మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోయింది.ఈ సందర్భంగా విద్యార్థులు,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ విజయ్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రజియుద్దీన్,లింగేశ్వర్,సృజన,స్రవంతి, రాజు,ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ ద్వారా మధ్యాహ్న భోజన చెల్లింపులకు చర్యలు

## - విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ - పెద్దపల్లి జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ అమలు

## - మధ్యాహ్న భోజనంపై విద్యాశాఖ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్




పెద్దపల్లి,మార్చి 03:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ఆన్‌లైన్ ద్వారా మధ్యాహ్న భోజన చెల్లింపులకు చర్యలు తీసుకుంటున్నామని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ, విద్యాశాఖ సంచాలకుల నరసింహారెడ్డితో కలిసి మధ్యాహ్న భోజన పథకం బిల్లుల చెల్లింపుపై జిల్లా కలెక్టర్లు,విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ మాట్లాడుతూ ట్రెజరీ ద్వారా మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు ప్రక్రియ ఆలస్యం అవుతుందని,నేరుగా ఆన్‌లైన్ నుంచే మధ్యాహ్న భోజనం బిల్లులు చెల్లించేందుకు గల అవకాశాలను విద్యాశాఖ పరిశీలిస్తుందని అన్నారు.రాష్ట్రంలో ముందస్తుగా భద్రాద్రి కొత్తగూడెం,పెద్దపల్లి జిల్లాలలో పైలట్ ప్రాజెక్ట్ కింద ఆన్‌లైన్ బిల్లుల చెల్లింపు ప్రారంభిస్తున్నామని ఆమె తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం,పెద్దపల్లి జిల్లాలలో ముందుగా ఒక మండలాన్ని ఎంపిక చేసుకుని,నెల రోజుల పాటు ఆ మండలం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన బిల్లులను ఆన్‌లైన్ ద్వారా త్వరితగతిన చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు.పైలట్ ప్రాజెక్ట్ నుంచి వచ్చే ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ చెల్లింపులు జరపడానికి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# డెకరేషన్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

మెట్ పల్లి: ప్రతినిధి మార్చి03 (ప్రజా కలం)డెకరేషన్ యూనియన్ నూతన అధ్యక్షులుగా ఊరే రాజారాం ఎన్నికయ్యారు,ఉపాధ్యక్షులుగా ఎస్.కె సదక్, ప్రధాన కార్యదర్శిగా గుంటుక చిన్నయ్య,కార్యదర్శి బారాడి శ్రావణ్,కోశాధికారిగా కట్టెకోల మహేందర్, ప్రచార కార్యదర్శిగా ఎనుగందుల విజయ్ మరియు కార్యవర్గ సభ్యులుగా గుండవేని ప్రణయ్, ఎస్ కే సలీం, ఎండి జాకీర్ ,మణిదీప్, నరేష్, మధు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన అధ్యక్ష కార్యవర్గ సభ్యులను ఘనంగా శాలువతో సన్మానం చేశారు.ఈ సందర్భంగా ఎన్నికైన భాద్యులు



ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన సాధారణ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# వార్డు12 లో తడి పొడి చెత్త పై అవగాహన




మెట్ పల్లి: ప్రతినిధి మార్చి03 (ప్రజా కలం)మున్సిపల్ కమిషనర్ టీ మోహన్ 12,వ వార్డులో తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్త గురించి అవగాహన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు తడి పోటీ డి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు సూచించారు.చెత్తను వేరు చేసి ఇవ్వాలని ఇంట్లో నుంచి వచ్చే పొడి చెత్తను పొడి వనరుల సేకరణ కేంద్రానికి తరలించడం జరుగుతుందని తెలిపారు. ప్రజల నుండి తడి పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని లేకుంటే చెత్త సేకరించబడదని ప్రజలు సహకరించగలరని కోరారు. పారిశుధ్యం పరిశుభ్రత స్వచ్ఛత కోసం సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, పురపాలిక ద్వారా అందిస్తున్న సేవలపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు స్వచ్ఛ సర్వేక్షన్ 2024 సర్వే ప్రారంభమైంది ప్రజలందరూ మెట్ పల్లిమున్సిపాలిటీ చేసే పారిశుద్ధ్య పనులను మొబైల్ ఫోన్ నుండి క్యూఆర్ కోడ్ ఉపయోగించి అభిప్రాయాన్ని తెలియచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, నిజాం, అశోక్, నరసయ్య పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# పోయిన సెల్ ఫోన్ అప్పగింత




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మార్చి03 (ప్రజా కలం) కోరుట్ల పట్టణానికి చెందిన బొజ్జ నరసయ్య తన ఫోనును గత జనవరి నెలలో కోరుట్లలోని నంది చౌరస్తా సమీపంలో ఫోన్ ను పోగొట్టుకున్నాడు. వెతికిన దొరకక పోవడంతో కోరుట్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కోరుట్ల పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ లో వివరాలు నమోదు చేసి అట్టి ఫోన్ ను గుర్తించి బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ ఎవరైనా వారి ఫోన్ పోగొట్టుకున్న దొంగతనానికి గురైన ఫోన్ వివరాలను సీఈఐఆర్ పోర్టల్ లో నమోదు నమోదు చేస్తే మొబైల్ ఫోను పొందే అవకాశం ఉంటుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవరికైనా మొబైల్ ఫోన్లు, అనుమానిత వస్తువులు ఇతర విలువైన వస్తువులు దొరికితే సమీప పోలీస్ స్టేషన్లో అప్పగించాలన్నారు. అంతేకానీ అలాంటి వస్తువులను తమ దగ్గర ఉంచడం వల్ల నేరం అవుతుందని ఎస్ఐ తెలిపారు.

# ఎస్సీ వర్గీకరణలో నేతకానీలకు ప్రత్యేక గ్రూప్ కేటాయించాలి

## - కలెక్టరేట్ వద్ద నేతకానీల శాంతియుత దీక్ష

పెద్దపల్లి,మార్చి 03:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

నేతకాని కులస్తులకు ఎస్సీ వర్గీకరణలో ప్రత్యేక గ్రూప్ కేటాయించాలని నేతకాని మహార్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కామెర ప్రకాష్ రాష్ట్ర




ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పెద్దపల్లి కలక్టరేట్ వద్ద సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుర్గం రాజేష్ ఆదేశాల మేరకు,పెద్దపల్లి జిల్లా ఇంఛార్జి పేగా శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం శాంతియుత ఆందోళన చేపట్టారు.అనంతర జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కామెర ప్రకాష్ మాట్లాడుతూ నేతకాని కార్పోరేషన్ వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు.ఏజెన్సీ ప్రాంత నేతకానీలకు ఏజెన్సీ హక్కులు కల్పించాలని,ఎస్సీ రిజర్వేషన్ 15 శాతం నుంచి 20 శాతానికి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తమ హక్కుల సాధనకు శాంతియుత పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.నేతకాని సమస్యల పరిష్కారానికి తమ సామాజికవర్గానికి చెందిన వారంతా కలిసికట్టుగా ఉద్యమంలో భాగస్వాములు కావాలని ప్రకాష్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నేతకాని మహార్ సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా నాయకులు గోలే లక్ష్మణ్,కుమ్మరి మల్లేష్,మాదాసు సుధాకర్,అక్కపెల్లి లక్ష్మయ్య,దూట లింగయ్య,అక్కపెల్లి చిన్న లక్ష్మయ్య,దుర్గం కొమురయ్య, అక్కపెల్లి ఓదెలు,అక్క పెల్లి శంకరయ్య,తదితరులు పాల్గొన్నారు.

# రెండు రోజులు కుళాయి నీరు బంద్

మెట్ పల్లి: ప్రతినిధి మార్చి03 (ప్రజా కలం) అమ్మక్కపేట గ్రామం వద్ద మిషన్ భగీరథ ప్రధాన పైప్ లైన్ లీకేజ్ కారణంగా మరమ్మతులు చేయడం జరుగుతుందని సంబందిత మిషన్ భగీరథ అధికారులు వెల్లడించినట్లు మున్సిపల్ కమిషనర్ టీ మోహన్ తెలిపారు. రెండు




రోజులు అనగా 4 నుండి 5– వరకు మెట్ పల్లి పట్టణంలో మిషన్ భగీరథ నీళ్ళు పంపిణి చేయడం జరగదని, దీనికి అందరూ సహకరించాలని తెలిపారు.

## మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్టాపనకు హాజరైన మాజీ మంత్రులు

**- ఆలయం లో కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్ లను శాలువాతో సన్మానం**



ఎండపల్లి మార్చి 03 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం వెల్గటూర్ మండలం పైడిపల్లి గ్రామం లో నిర్వహిస్తున్న శ్రీ మల్లికార్జున స్వామి శికర యంత్రం, శిలా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మల్లన్న పెద్ద పట్నాల జాతర మహోత్సవానికి హాజరైన మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్ గంగుల కమలాకర్ ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం యాదవ సంఘం పాలక వర్గం మాజీ మంత్రుల ను ఘనంగా శాలువా తో సన్మానించినట్లు పైడిపల్లి యాదవ సంఘం సభ్యులు తెలిపారు.

## మార్చి 8 న ఖనిలో మహిళా దినోత్సవ వేడుకలు..

**- ఆర్జీవన్ సేవా అధ్యక్షురాలు డి.అనిత లలిత్ కుమార్**



గోదావరిఖని, మార్చి 03: (ప్రజా కలం ప్రతినిధి) ఆర్జీ వన్ ఏరియాలో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ఆర్జీవన్ సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్ తెలిపారు .అంతర్జాతీయ మహిళా దినోత్సవమును పురస్కరించుకొని మహిళా ఉద్యోగినులు,సేవా సమితి శిక్షకులతో జిఎం కార్యాలయం నందు ఆర్జీ వన్ సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్ అధ్వర్యంలో సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్జీవన్ సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవమును పురస్కరించుకొని సింగరేణి మహిళా ఉద్యోగస్తులకు, గృహిణులకు, మహిళలకు వివిధ ఆటల పోటీలు స్థానిక జి.యం కాలని గ్రౌండ్ గోదావరికళా ప్రాంగాణం నందు గురువారం మధ్యాహ్నం . 3.00 గం.లకు నిర్వహించనున్నామని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవమును పురస్కరించుకొని మార్చి 8 న శనివారం ఉదయం. 10.00 గం.లకు స్థానిక ఆర్.సి.ఓ.ఎ క్లబ్ నందు అత్యుత్తమ సేవలందించిన మహిళలకు సన్మానం చేయనున్నామని తెలిపారు.మహిళలచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆటల పోటిలలో గెలుపొందిన మహిళలకు బహుమతుల ప్రధానం ఉంటుందని తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో డిజియం పర్సనల్ కిరణ్ బాబు, సీనియర్ పి.ఓ హన్మంతరావు, సేవా జాయింట్ సెక్రటరి బినా సింగ్, ఎ.ఐ.టి.యు.సి ప్రతినిది పద్మ,కో–ఆర్డినేటర్లు తిరుపతి, రవికుమార్ సేవా శిక్షకులు తదితరులు పాల్గోన్నారు.

**56వ డివిజన్ మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా**

## శనిగారపు అనిత నియామకం

**నియామక పత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు,నాయిని రాజేందర్ రెడ్డి**



హనుమకొండ మార్చి 3 ప్రజా కలం ప్రతినిధి వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా శనిగారపు అనిత నియమిస్తూ సోమవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా నియమిస్తూ తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి,కె.ఆర్ నాగరాజు లకు శనిగారపు అనిత ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ మహిళల అభ్యున్నతకు నిరంతరం పాటుపడతానని అనిత తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## మామునూర్ నాలుగవ బెటాలియన్ లో బ్యాంక్ అఫ్ మహారాష్ట్ర హనుమకొండ బ్రాంచ్ ఆధ్వర్యంలో బ్యాట్మింటన్ పోటీలు

హనుమకొండ మార్చి 3 ప్రజా కలం ప్రతినిధి మామునూర్ నాలుగవ బెటాలియన్ ఆవరణలో ఈ రోజు నుండి బ్యాంక్ అఫ్ మహారాష్ట్ర హన్మకొండ వారు బెటాలియన్ లోని ఆఫీసర్స్ మరియు సిబ్బందికి బ్యాట్మింటన్ పోటీలను నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గౌరవ అడిషనల్ కమాండెంట్ ఎం.ఐ.సురేష్ పోటీలను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ వీరన్న,రిజర్వ్ ఇన్స్పెక్టర్లు రవి,వెంకటేశ్వర్లు,రాజ్ కుమార్, అశోక్,కృష్ణ బ్యాంక్ మేనేజర్ రమేష్,బెటాలియన్ ఆఫీసర్స్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



**మిస్టరీ హత్య కేసును చేధించిన పోలీస్ అధికారులకు**

# నగదు పురస్కారం

హనుమకొండ మార్చి 3 ప్రజా కలం ప్రతినిధి

గత రెండు సంవత్సరాలు మిస్టరీగా మిగిలిపోయిన కేసును చేధించి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పరకాల ఏసిపి సతీష్‌బాబుతో పాటు శాయంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ రంజిత్‌లను వరంగల్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందిస్తూ నగదు పురస్కారాలను అందజేశారు. వివరాల్లోకి వెళితే రెండు సంవత్సరాల క్రితం పరకాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారం గ్రామ శివారులో జరిగిన ఓ వృద్ధురాలి హత్యకేసులో నిందితులు పట్టుకోవడంలో ఎలాంటి క్లూస్ పరకాల పోలీసులకు లభించకపోవడంతో పాటు పరకాల పోలీస్ స్టేషన్ పలుపురు ఇన్స్పెక్టర్లు పలుమార్లు బదిలీ కావడంతో ఈ కేసు ఓ మిస్టరీగా నిలిచిపోవడం జరిగింది. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కేసు దర్యాప్తును శాయంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ రంజిత్ అప్పగించడం జరిగింది. దీనితో పరకాల ఏసిపి పర్యవేక్షణలో ఈ హత్య కేసు దర్యాప్తు చేపట్టిన రంజిత్ కొద్ది రోజుల్లోనే హత్యకు గురైంది శాయంపేట మండలం ఆరెపల్లి గ్రామస్తురాలిగా గుర్తించడంతో పాటు బంగారు అభరణాల కోసం అదే గ్రామానికి చెందిన ఇంటి రాజిరెడ్డి



హత్య గురైన వృద్ధురాలిని తీసుకువెళ్ళి ధర్మారం గ్రామ శివారులో దారుణంగా హత్య చేసినట్లుగా సర్కిల్ ఇన్స్పెక్టర్ దర్యాప్తులో బయటపడటంతో వృద్ధురాలి హత్య చేసిన రాజిరెడ్డిని గత నెలలో పరకాల పోలీసులు అరెస్టు చేసిన రిమాండ్ తరలించారు. ఎంతో కాలంగా పెండిరగ్‌లో వుంది పోలీసులకు ఓ సవాలుగా నిలిచిన ఈహత్యకేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులకు వరంగల్ పోలీస్ కమిషనర్ నగదు పురస్కారాలను అందజేసారు. ఈ కార్యక్రమములో డిసిపి రవీందర్ పాల్గొన్నారు.

## ఏ ఐ యం స్కూల్ లో ఘనంగా ఫేర్వెల్ పార్టీ వేడుకలు

**- అలరించిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు**

ప్రజాకలం ప్రతినిధి పాల్వంచ మర్చి 03

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ లోని నటరాజ్ సెంటర్ లో ఏ ఐ యం పాఠశాల నందు పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఆదివారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఏ ఐ యం ప్రిన్సిపాల్ రెంటల. నాగ భూషణం ఆధ్వర్యం లో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా భూషణం మాట్లాడు తూ జీవితంలో ప్రధానమైన అంశాలు తల్లిదండ్రులు, గురువులు, గురువు దేశ ప్రతిష్ట, ఉన్నత శిఖరాలు ఎదగటానికి బాలబాలి



కలు విద్యార్థి దశ నుండి మంచి క్రమ శిక్షణ తోడ్పడుతుందని, అటువంటి క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన మన ఏ ఐ యం పాఠశాలలో మాత్రమే జరుగుతుందని తెలిపారు. చదువుతో పాటు గుణం కూడా ముఖ్యం, మన మనసు వెళ్ళిన ప్రతి చోటుకు శరీరం కూడా వెళ్ళాలి అనిపిస్తుందని, మనసుని మంచి పనుల మీద విద్యార్థులు పెట్టాలని, ఖర్చు పెట్టే ప్రతి రూపాయి ఎక్కడినుండి వచ్చాయనేది గ్రహించాలని, ప్రతి విషయాన్ని క్షుణంగా పరిశీలించాలని, దాని వలన జీవితంలో ఒక గమ్యం ఏర్పడుతుందని, మంచి ప్రవర్తన మనలో కలిగిస్తుందని తెలిపారు. అలానే ప్రతి విద్యార్థి పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని చేరే వరకు విశ్రమించరాదన్నారు. విలువలతో కూడిన విద్యను అందిస్తూ, విద్యార్థులను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తూ సామాజిక అవగాహన పెంచే విధంగా విద్యార్థులను తీర్చి దిద్దుతున్నామని ఆయన తెలిపారు. శక్తి సామర్థ్యాలను పెంచుకునేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. విద్యార్థి తన జీవితంలో ఉన్నతంగా ఎదగటానికి చిన్నతనంలో పాఠశాలలో నేర్చుకున్న జ్ఞానమే దోహదపడుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి దేశభక్తిని పెంపొందించుకొని సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని తల్లిదండ్రులను, అధ్యాపకులను గౌరవించాలని అన్నారు .అలానే గురువులు తల్లిదండ్రులైతే, వారి తరువాత అధ్యాపకులదే ప్రముఖ స్థానమని, కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా ఆటపాటలతో పాటు అన్ని రంగాలలో విద్యార్థులు ముందుండే విధంగా తమ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. పాఠశాల దశను ముగించుకొని పై చదువులకు వెళుతున్న విద్యార్థులకు జీవితంలో విజయం సాధించాలంటే నిజాయితీతో కష్టపడాలని అన్నారు . ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా వాటిని అధిగమించాలని తద్వారా విజయానికి చేరువౌతామని తెలిపారు. పాఠశాల జీవితం బంగారం లాంటిదని, ఈ బాల్యం చాలా సున్నితమైనదని, చాలా విలువైనదని, స్కూల్ దశలో వేసే పునాది తదుపరి జీవితకాలం ఉపయోగపడుతుందని తెలిపారు. నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగి చదువుకున్న పాఠశాలకు పేరుతేవాలని అన్నారు . అనంతరం చిన్నారులు ఉత్సాహంతో కేరింతలతో మారుమ్రోగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల డ్యాన్స్ లు, సాంస్కృతిక కార్యక్రమాలుఅందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ ఉద్యమ కారులకి కాంగ్రెస్ పార్టీ**

## ఇచ్చిన హామీలను వెంటనే అమలు చెయ్యాలి

**- తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఆధ్వర్యంలో పోస్ట్ కార్డ ఉద్యమము**

ఖమ్మం మార్చి 03( ప్రజా కలం న్యూస్)

ఖమ్మం నగరంలోని సోమవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మయూరి సెంటర్ అమరవీరుల స్థూపం దగ్గర తెలంగాణ ఉద్యమకారులు పోస్ట్ కార్డ్ మీద కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులకి ఇచ్చిన హామీలైన ప్రతి ఉద్యమకరుడికి 250 చ: గ: స్థలాన్ని , 25వేల పెన్షన్ సౌకర్యం , గృహ నిర్మాణం కొరకు 10లక్షల రూపాయల నగదు లను వెంటనే అమలు చెయ్యాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాసి పోస్ట్ బాక్స్ లో వెయ్యడం జరిగింది . 33జిల్లాలో ఉన్న తెలంగాణ ఉద్యమ కారులు అందరూ తమ తమ జిల్లాల్లో ఈ పోస్ట్ కార్డ్ ఉద్యమము ద్వారా పోస్ట్ కార్డ్ లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోస్ట్ చేస్తున్నారు . కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వారి మానిఫెస్టో లో గత ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకరులకి పైన తెల్పిన హామీలను 6 గ్యారంటీల స్కీమ్ లో పొందుపరచడం జరిగింది . కాబట్టి ఆ హామీలను అమలు చెయ్యాలని కోరుతూ పోస్ట్ కార్డ్ ఉద్యమము ప్రారంభం చేశారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డా "కె.వి.కృష్ణారావు , తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా



చైర్మన్ పసుపులేటి నాసరయ్య మరియు ఉద్యమకారులు గుంతేటి వీరభద్రమ్ , పెళ్లూరి విజయ్ కుమార్ , రవిచంద్ర చౌహాన్ , షేక్ నాగుల్ మీరా , షేక్ అబ్బాస్ అలి , బురాన్ , ఆసిఫ్ , శ్రీనివాస్ నాయక్ , బాలిని భాస్కరరెడ్డి , దేవిరెడ్డి విజయ్ , భట్టు రాజేందర్ నాయక్ , బెల్లంకొండ నాగేశ్వరావు , రాము గౌడ్ , వల్లేపు సోమరాజు , యాకూబ్ , గాలి రాము గౌడ్ , ఆంకాలు , శ్రీనివాస్ విజయ్ , గద్దె వెంకట్రామయ్య , రెడ్డేబోయిన వరలక్ష్మి , కొరివి ధనలక్ష్మి , కామని అనంతలక్ష్మి , స్వరూప , ధనలక్ష్మి , జయ, తదితరులు పాల్గొన్నారు .

## హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా సల్మాన్ రాజ్ నియామకం...

**హర్షం వ్యక్తం చేసిన బార్ ప్రెసిడెంట్ కోట దేవదానం**

ప్రజాకలం ప్రతినిధి

భద్రాచలం...మార్చి 03:

తెలంగాణ హైకోర్ట అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా జెట్టి సాల్మాన్ రాజ్ నియామకం పట్ల భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోట దేవదానం హర్షం వ్యక్తం చేశారు.భద్రాచలం బార్ అసోసియేషన్ లో సీనియర్



న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర హై కోర్ట లో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా నియమించబడటం అభినందనీయమని అన్నారు. భద్రాచలం మొబైల్ కోర్ట్ లో ఆరు సంవత్సరాలు ప్రభుత్వం తరుపున ఏజీపిగా పని చేశారు.సాల్మాన్ రాజ్ ఇంకా ఉన్నం ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

**నందిగామ కేంద్రంలో మాజీ ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు కొమ్ము కృష్ణ పర్యవేక్షణలో**

## ఉచిత కంటి చూపు పరీక్షలు

(నందిగామ మార్చ్ 03 (ప్రజాకలం (ప్రతినిధి)


నందిగామ గ్రామ పంచాయితీ పరిధిలో ఈరోజు మాజీ ఎంపిటిసి కొమ్ము కృష్ణ పర్యవేక్షణలో వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వారు ఈరోజు ఉదయం ఉచిత కంటి పరీక్షలు శిబిరం ఏర్పాటు చేశారు నందిగామ మండల ప్రజలు కంటి సమస్యలు ఏవి ఉన్న గ్రామపంచాయతీ వద్ద ఏర్పాటుచేసిన కంటి శిబిరం వద్దకు వచ్చి కంటి పరీక్షలు చేయించుకోవాలని. ఈ కంటి పరీక్షా శిబిరం ఈరోజు మరియు



రేపు ఈ రెండు రోజులు కంటి పరీక్షలు పూర్తి ఉచితంగా కొనసాగిస్తారు కావున మీయొక్క ఆధార్ గుర్తింపు కార్డును తీసుకొని వచ్చి మీయొక్క పేరును నమోదు చేసుకొని కంటి పరీక్షలు చేయించుకోగలరనీ కొమ్ము కృష్ణ సూచించారు. ఈ కార్యక్రమంలో వాసన్ కంటి ఆసుపత్రి యాజమాన్యం శ్రీకాంత్. వారి సభ్యులు. మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు. తడకల జంగయ్య. జాంగారి రాములు. బొమ్మగల నరసింహ.సత్తిపండు. ఎర్రగారి రమేష్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు

## నిరుపయోగంగా ఉన్న దివ్యాంగుల భవనాన్ని పునరుద్ధరించాలి

**వికారాబాద్ జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షులు పోతురాజు సుధీర్**



వికారాబాద్ జిల్లా మార్చి 03(ప్రజాకలం ప్రతినిధి )

మండలకంలోని నిరుపయోగంగా ఉన్న దివ్యాంగుల భవనాన్ని ప్రారంభం చేయాలని సోమవారం నవాబుపేట ఎంపీడీఓ అనురాధ కు వినతి పత్రం అందించారు.నవాబ్ పేట మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న వికలాంగుల భవనాన్ని పునరుద్ధరించి వికలాంగులకు ఉపయోగకరంగా ఉండేవిధంగా అందుబాటులోకి తేవాలని వికారాబాద్ జిల్లా భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి సంఘం జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుధీర్ కోరినాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవాబుపేట మండలంలో ఎన్నో సంవత్సరాల క్రితం వికలాంగుల అవసరార్థం నిర్మితమై ఉన్న వికలాంగుల భవనం ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న కారణంగా మన మండల పరిధిలోని వివిధ సమస్యలపై చర్చించుకునేందుకు వికలాంగుల సంఘ సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు మండలంలోని వికలాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ రోడ్డు పక్కల సమావేశం ఏర్పాటు చేసుకునే దుస్థితి దాపరించిందని అన్నారు. ఇట్టి విషయంపై ఎంపిడిఓ వెంటనే స్పందించి ప్రభుత్వం వికలాంగుల అవసరార్థం నిర్మించిన వికలాంగుల భవనాన్ని వికలాంగులకు అందుబాటులోకి తీసుకువచ్చి భవనాన్ని పునరుద్ధంచవలసిందిగా కోరినారు.ఈ కార్యక్రమంలో మోదిన్, దనరాజ్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.22 కోట్ల వ్యయంతో 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి మంజూరు

**- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కృషి తో జీవో ఆర్ టీ నెం. 65 విడుదల చేసిన ప్రభుత్వం**

**- హర్షం వ్యక్తం చేసిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు.**

మధిర మార్చి 03( ప్రజా కలం న్యూస్)



ఖమ్మం తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,ఆర్థిక,విద్యుత్ శాఖల మంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క, నేతృత్వంలో మధిర నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకువెళ్తుంది.మధిర నియోజకవర్గ అభివృద్దే ఏకైక లక్ష్యంగా అడుగులు వేస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కృషి తో తాజాగా ముదిగొండ కేంద్రంగా 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని మంజూరు చేయించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు 50 పడకల ఆసుపత్రి మంజూరు చేయిస్తానని ఇచ్చిన హామీ మేరకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 15 నెలల కాలంలోనే హామీని నెరవేర్చారు. అందులో భాగంగానే నేడు రూ. 22 కోట్ల వ్యయంతో 50 పడకల ఆసుపత్రిని మంజూరు చేస్తూ జీవో ఆర్ టి నెం. 65 రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో ముదిగొండ మండల ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. ఆసుపత్రిని మంజూరు చేయించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వాజేడు, మార్చి 03( ప్రజా కలం) భూపాల్ పట్నం మండల పరిధిలోని తాళ్లగూడెం ప్రధాన రహదారిపై మూలమలుపు సమీపంలో కంటైనర్,టీవీఎస్ ద్విచక్ర వాహనం



ఢీకొని మంచాల అచ్చుయ్య (60) మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే వాజేడు మండల పరిధి లోని అయ్యవారిపేట గ్రామానికి చెందిన అచ్చుయ్య తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం భూపాలపట్నం నుండి స్వగ్రామానికి సోమవారం సాయంత్రం టీవీఎస్ మోపెడ్ వాహనంపై వెల్లి వస్తున్న క్రమంలో తాళ్ల గూడెం, సంతపాకల మూలమలుపు వద్ద తెలంగాణ నుంచి ఛత్తీస్ ఘడ్, వెళుతున్న కంటైనర్, టీవీఎస్ మోపెడ్ ఎదురెదురుగా ఢీకొనడంతో అచ్చుయ్య తలకు తీవ్ర గాయాలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుని కూతురు సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాళ్లగూడెం పోలీస్ స్టేషన్ లో కంటైనర్ డ్రైవర్ పై కేసునమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అయ్యవారిపేట గ్రామానికి తీసుకొచ్చినట్లు తెలిపారు.

## గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక రాష్ట్ర అధ్యక్షులు గొల్లపెల్లి సత్యం గౌడ్ కు సన్మానం



ఎండపల్లి, మార్చి 03 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామం లో సోమవారం రోజున మర్రి మండువ దగ్గర గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక రాష్ట్ర కమిటీ నూతన అధ్యక్షులు గా నియమితులై నందుకు గొల్లపెల్లి సత్యం గౌడ్ కు సన్మాన మహోత్సవానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు సముద్రాల తిరుపతి అనిల్ పాల్గొనగా గౌడ సంఘం సభ్యులు అమరగొండ సత్య నారాయణ ఆధ్వర్యం లో గొల్లపెల్లి సత్యం గౌడ్ కు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు రాష్ట్ర అధ్యక్షులు గొల్లపెల్లి సత్యం గౌడ్ మాట్లాడుతూ గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు ఇక్కడ అవకాశాలు తక్కువ ఉండి గల్ఫ్ వెళ్తే అక్కడ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని వస్తాం కాని మనకు సహాయం చేయడానికి ఇండియా ఏంబాసి ఉండదు ఏ దేశంలో అయినా ఇండియా ఎంబిసి ఉండాలని గల్ఫ్ లో చనిపోయిన వారిని కూడా ఇండియాకు ఇంటికి తీసుకు రావడానికి కూడా ఎన్నో రోజులు పడుతుంది అందుకే మనకంటూ ఒక ఇండియా ఎంబాసి ఉండాలని గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక ఉండాలని ఒక్క సంస్థను దోనికేని క్రిష్ణ స్థాపించాడు నిర్మల్ టు హైదరాబాద్ దాకా ఎన్నారై పాలసీ రావాలని పాదయాత్ర కూడా చేశాడు. అందులో భాగంగానే గుల్లకోట నుండి నేను కూడా పాదయాత్రలో పాల్గొన్నాను వారితో పాటు గుల్లకోట యువకులు కూడా చాలామంది పాదయాత్రలో పాల్గొన్నారు ఇంతకు ముందు నేను జగిత్యాల జిల్లా అధ్యక్షులుగా ఉన్నాను నా వంతు కృషినీ ఇతరులకు సహాయం చేసే గుణం ఉన్న వ్యక్తిని అని తెలిపారు దొనికేని క్రిష్ణ నన్ను గుర్తించి నాకు రాష్ట్ర అధ్యక్షులు గా నన్ను నియమించారు నేను సౌదీలో ఉన్నప్పుడు చాలామందికి సహాయం చేశాను అది కాక చనిపోయిన వారిని కూడా యజమానిని సౌదీలో కపిల్ అంటాం ఆ కపిల్ దగ్గరికి వెళ్లి చనిపోయిన వారిని ఇండి యాకు రప్పించడం కోసం ఎవరికైనా ఇబ్బందులు ఉన్నవారికి ఆ కపిల్ దగ్గరకు పోయి వారి గురించి కపిల్ తో మాట్లాడడం చాల మందికి సహాయం చేశాను అది కాక మన విలేజ్ పక్కకు ఉన్న కొండాపూర్ లో అయితే ఒక వ్యక్తి మస్కట్లో చనిపోయి ఆరు నెలల వరకు ఇండియాకు తన శవాన్ని తీసుకు రాలేదు అందులో నేను చొరవ తీసుకొని చనిపోయిన వ్యక్తిని ఇండియాకు రప్పించడమే కాకుండా గుల్లకోట యువకులు, నేను నా వంతు సహాయం అందించాం ఇప్పుడు నన్ను గుర్తించి రాష్ట్ర అధ్యక్షులుగా నియమించినందుకు ధోనికేని క్రిష్ణకు ధన్యవాదాలు తెలుపుతు న్నాను ఈ కార్యక్రమం లో గౌడ సంఘం సభ్యులు అమరగొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు గొల్లపెల్లి సత్యం గౌడ్ ను శాలువాతో సన్మానించినట్లు అమరగొండ సత్యనారాయణ తెలిపారు.

## గొత్తికోయ గూడెంలో వైద్య శిబిరం

### - వేసవిలో తగు జాగ్రత్తలు పాటించాలి

### - డాక్టర్ చీర్ల శ్రీకాంత్-

వెంకటాపూర్ (రామప్ప) ,మార్చి 3, ప్రజా కలం:-

సోమవారం రోజున అడవి ప్రాంతంలో నివసిస్తున్న గొత్తి కోయలు వేసవికాలంలో తగు జాగ్రత్తలు పాటించాలని వెంకటాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చీర్ల శ్రీకాంత్ అన్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం కేంద్రం శివారు అడవి ప్రాంతంలో ఎనిమిది కిలోమీటర్ల



దూరంలో నివసిస్తున్న గొత్తి కోయ గూడెంలో సోమవారం స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చీర్ల శ్రీకాంత్ వైద్య సిబ్బందితో కలిసి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గూడెంలో నివాసం ఉంటున్న వారందరిని పరీక్షించి అవసరమైన 45 మందికి రక్త పరీక్షలు చేసి మందులను అందజేశారు. గర్భిణీలు, చిన్న పిల్లలకు అవసరమైన టీకాలను వేశారు. గూడెంలో దోమలు నిల్వ ఉండకుండా దోమల మందులు పిచికారి చేయించారు. అనంతరం డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ అడవి ప్రాంతంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని వాటి ద్వారా మలేరియా, డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. వేసవిలో డయేరియా ఎక్కువగా ఉంటుందని దానిని నివారించేందుకు కాచి వడపోసిన నీటిని తాగాలని సూచించారు. ఎవరికైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ఆరోగ్య కార్యకర్తను,గాని మండల కేంద్రంలో ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో సంప్రదించి వైద్య సహాయం పొందాలన్నారు. అనంతరం వై ఆర్ జి కేర్ స్వచ్ఛంద సేవా సంస్థ సూపర్వైజర్ రజిని, లింక్ వర్కర్ స్వప్న హెచ్ఐవి ఎయిడ్స్ పై గొత్తి కోయలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి నవీన్, సిహెచ్ఓ దుర్గారావు, ఏఎన్ఎం లు అనురాధ స్వప్న, ఆశా కార్యకర్తలు సరోజన, మాధవి, సౌజన్య, ఇందిర, కవిత, సంపూర్ణ, శోభ, పాల్గొన్నారు.



## పొదిల పార్వతి దశదిన కర్మ కార్యక్రమం లో పాల్గొన్న తుంబూరు దయాకర్ రెడ్డి, మేకల మల్లిబాబు యాదవ్



ఖమ్మం మార్చి 03(ప్రజా కలం న్యూస్) ఖమ్మం నగరంలోని సోమవారం యాదవ సంఘం నాయకులు పొదిల చిన్న పాపారావు సతీమణి పొదిల పార్వతి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఈరోజు జరిగిన వారి దర్శన కర్మ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ ఆఫీస్ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి , జిల్లాఅఖిలభారత యాదవ మహాసభ గౌరవ అధ్యక్షులు మేకల మల్లి బాబు యాదవ్ , జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య , జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ లు పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు . వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని తోడుగా నీడగా ఇన్నాళ్లు తనతో జీవితాన్ని పంచుకొని చివరి దశలో సతీమణిని కోల్పోవడం దురదృష్టకరమని , విచారం వ్యక్తం చేశారు పాపారావును , కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు . ఈ కార్యక్రమానికి విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు కార్యకర్తలు కొత్త రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇళ్ల గురించి ప్రస్తావించగా అర్హులైన ప్రతి ఒక్కరికి దశలవారీగా కొత్త రేషన్ కార్డులు ఇండ్లు , కొత్త పింఛన్లు మంజూరు అవుతాయని దయాకర్ రెడ్డి తెలిపారు . ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగొర్ల హనుమంతరావు , చేతుల నాగేశ్వరరావు , మొరిమేకల కోటయ్య , గోసు మధు , తోడేటి లింగ రాజు , పొదిల సతీష్ , పొదిల తిరపయ్య , పొదిల భూపతి , పల్లపాటి పుల్లారావు , పొదిల బిక్షం , పొదిల పాపారావు , మేకల మల్లికార్జునరావు , శీలం పుల్లయ్య , మేకపోతుల మహేష్ , పొదిల రాజు , నవ్య , పొదిల రాము , చిలకల లత శ్రీ , నాగరాజు, మీగడ అంజయ్య , గడ్డం రామయ్య, తదితర బంధు మిత్రులు, తదితరులు పాల్గొన్నారు .

## యాసంగి పంటలను సంరక్షించేలా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలి

### - జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**- రాబోయే 10 రోజుల పాటు అధికారులు అప్రమత్తంగా ఉంటూ నీటి సరఫరా పర్యవేక్షించాలి**

ఖమ్మంమార్చి03( ప్రజా కలం న్యూస్)

యాసంగి పంటలను సంరక్షించేలా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి యాసంగి పంటలకు సాగునీటి సరఫరా, గురుకులాల్లో రెగ్యులర్ గా తనిఖీలు, ప్లాస్టిక్ ఫ్రీ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. రాబోయే 10 రోజుల పాటు అప్రమత్తంగా ఉంటూ యాసంగి పంటల సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని సిఎస్ సూచించారు. ఎత్తిపోతల పథకాలకు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. రిజర్వాయర్ల నుంచి విడుదల చేసిన ప్రతి నీటి చుక్కను సమర్థవంతంగా వినియోగించాలని అన్నారు. గురుకులాల్లో రెగ్యులర్ గా తనిఖీలు చేస్తూ పిల్లలకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూజిల్లా కలెక్టరేట్ లో ప్లాస్టిక్ బాటిల్స్ నిషేధించామని, స్టీల్ బాటిల్స్ మాత్రమే వినియోగిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇందిరా మహిళా



శక్తి కార్యక్రమం క్రింద ఏర్పాటు చేసిన టీ స్టాల్స్ లో కూడా ప్లాస్టిక్ నిషేధించామని అన్నారు. జిల్లాలో మండలాల్లోని తహసిల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు ప్లాస్టిక్ ఫ్రీ చేశామని అన్నారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడు తూ, పంటలను సంరక్షించేలా అధికారులు పటిష్ట చర్యలు తీసుకొని రాబోయే 10రోజుల పాటు అప్రమత్తంగా ఉంటూ నీటి సరఫరా పర్యవేక్షించాలని,వ్యవసాయానికి విద్యుత్ సరఫ రా లోటు రాకుండా చర్యలుతీసుకోవాలనిసూచించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ఎస్ఇ లు వాసంతి, ఎం. వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసా చారి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి ఎం.వి. మధుసూదన్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ మహిళా దినోత్సవ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ



ఖమ్మం మార్చి 03( ప్రజా కలం న్యూస్)

ఖమ్మం నగరంలోని సోమవారం మహిళా దినోత్సవం 2025 వేడుకలు పోస్టర్ ను ముజామిల్ ఖాన్ ఐఏఎస్ కలెక్టర్, జిల్లా మ్యాజిస్ట్రేట్, అడిషనల్ కలెక్టర్ డాక్టర్ పి శ్రీజ, కలెక్టరేట్ లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీమతి జి ఉషశ్రీ కార్యదర్శి పి సుధారాణి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి టీజీవో జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ, కార్యదర్శి మోదుగు వేలాద్రి, ట్రెజరర్ కే శేష ప్రసాద్, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి విజయ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సూరంపల్లి రాంబాబు హాజరయ్యారు. మార్చి 8 వ తారీకు ఉదయం 10:00 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు వివిధ క్రీడల పోటీ కార్యక్రమాలు ఉంటాయని జిల్లాలోని గెజిటెడ్ అధికారులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలియజేశారు. మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళా గెజిటెడ్ అధికారులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు మహిళలు జిల్లాలో వివిధ విభాగాలలో సమర్థవంతంగా వారి బాధ్యతలు నిర్వహిస్తున్నారని వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వాహకులు, కార్యవర్గ సభ్యులు వై మంజుల సంయుక్త కార్యదర్శి, కె విజయలక్ష్మి ఆర్గనైజింగ్ సెక్రటరీ, బి శారద పబ్లిసిటీ సెక్రటరీ, ఆశాలత డిస్టిక్ పంచాయతీ ఆఫీసర్, కళావతి బాయ్ డిఎం అండ్ హెచ్ ఓ, రాజేశ్వరి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, అరుణ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, పద్మశ్రీ డిస్టిక్ రెవెన్యూ ఆఫీసర్, జి జ్యోతి బీసీ డెవలప్మెంట్ ఆఫీసర్, ఎన్ మాధవి ఎంప్లాయిమెంట్ ఆఫీసర్, డి పుష్పలత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మిషన్ భగీరథ, ఎన్ విజయలక్ష్మి జిల్లా ట్రైబల్ వెల్ఫేర్, ఎన్ కనకదుర్గ, బి నాగేంద్ర కుమారి, ప్రమీల, డి సుజాత, లావణ్య, వాణిశ్రీ, వాసవిరాణి, ఉదయశ్రీ, చంద్రకళ, నాగమణి, జోష్ణ, వీరభద్రమ్మ, విజయ్ కుమారి, సరళ దేవి, నాగమణి, ప్రమీల, రమాదేవి, అనిత, సుమ మాధురి, కృష్ణకుమారి మరియు మహిళా గెజిటెడ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు కలెక్టరేట్ లో మార్చి 5 నుంచి ఉచితంగా భోజనం

### - జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


ఖమ్మం మార్చి 03(ప్రజా కలం న్యూస్)

ఖమ్మం జిల్లా కలెక్టరేట్ కు వివిధ పనుల నిమిత్తం వచ్చే దివ్యాంగులకు ఉచిత భోజన సదుపాయాన్ని మార్చి 5వ తారీఖు నుంచి కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దివ్యాంగులు తమ సమస్యల పరిష్కారం , వివిధ పనుల కోసం సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కలెక్టరేట్ కు వస్తున్నారనే అంశం దృష్టిలో ఉంచుకొని పని దినాలలో వారికి కలెక్టరేట్ క్యాంటీన్ నందు మధ్యాహ్నం ఉచిత భోజన వసతి కల్పించాలని నిర్ణయించామని అన్నారు.

అన్నం, ఆకు కూర పప్పు, రోటి, పచ్చడి, 2 కూరలు, సాంబార్/రసం, పెరుగుతో మంచి భోజనం దివ్యాంగులకు అందించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ నందు ఉన్న వివిధ కార్యాలయాలకు కూపన్లు పంపడం జరుగుతుందని, 40 శాతం వైకల్యం గల దివ్యాంగులకు వీటిని జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు.

ఒక్కొక్క భోజనానికి 80 రూపాయల చొప్పున క్యాంటీన్ కు చెల్లించడం జరుగుతుందని, ప్రతిరోజు జారీ చేసిన కూపన్, దివ్యాంగుల వివరాలు రిజిస్టర్ లో నమోదు చేసుకుంటామని, నెలకు ఒకసారి క్యాంటీన్ నిర్వాహకులకు బిల్లుల చెల్లింపు



చేస్తామని అన్నారు. కలెక్టరేట్ కు వివిధ పనులపై వచ్చే దివ్యాంగులకు చక్రాల కుర్చీ సదుపాయం కల్పించేందుకు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం నందు ఇద్దరు సిబ్బందిని కేటాయించాలని కలెక్టర్ సూచించారు.

దివ్యాంగులకు ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్నామనే విషయాన్ని తెలియజేస్తూ కలెక్టరేట్ అన్ని విభాగాల ప్రవేశ మార్గాలలో సూచన బోర్డులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 5 నుండి దివ్యాంగులకు ఉచిత భోజన సదుపాయం ప్రారంభమవుతుందని దివ్యాంగులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడపొద్దు :ఎస్సై ఈ.రాజేష్



ప్రజాకలం ప్రతినిధి బూర్గంపహాడ్ మార్చి 03: ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపొద్దని బూర్గంపాడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాజేష్ అన్నారు. సోమవారం సారపాక గ్రామంలోని ప్రధాన రహదారి వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్‌లు జరిగాయి. ఈ సందర్భంగా %బా×% మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాహనాన్ని వినియోగించాలన్నారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు అందించారు. నిబంధనలు పాటించకుండా వాహనాలను నడుపుతూ పట్టుబడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

## మతాలు వేరైనా మనుషులందరూ ఒక్కటే

### ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన సదర్ శీను





(నందిగామ మార్చ్ 03 ప్రజాకలం ప్రతినిధి)

నందిగామ మండల కేంద్రంలో రంజాన్ మాసం పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేస్తున్న మైనారిటీ సోదరులకు ఈరోజు సదర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కేశముని శ్రీనువాస్ యాదవ్ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సదర్ శ్రీను మాట్లాడుతూ. మతాలు కాకుండా ప్రేమ. సద్భావన. శాంతి స్వభావం. కలిగి సోదర భావంతో మనమందరం కలిసి మెలిసి ఉండాలని మతాలు వేరైనా మన అందరికి దేవుడు ఒక్కడే అని శాంతిని కలిగిన మార్గాన్ని ప్రజలందరూ అనుసరించి రంజాన్ మాసం ఉపవాస దీక్షను ఆనందోత్సవంతో జరుపుకోవాలని ముస్లిం సోదరుల కుటుంబాలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ చించెట్టి శివకుమార్ గౌడ్. బుర్రి సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## పట్టుదలతో కష్టపడితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చు

### - ఐ టీ డి ఏ పీ ఓ రాహుల్

ప్రజాకలం ప్రతినిధి దుమ్ముగూడెం మర్చి 03: పట్టుదలతో కష్టపడితే ప్రతి ఒక్కరు ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చునని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ ఐఏఎస్ అన్నారు. సోమవారం దుమ్ముగూడెం మండల పరిధిలోని రామచంద్రుని పేట గిరిజన




సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అవగాహన కార్యక్రమంలో ఐటిడిఏ పిఓ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ... పదవ తరగతి విద్యార్థినిలే కాక ఎనిమిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు భవిష్యత్తులో ఏ రంగంలో స్థిరపడాలని అనుకుంటున్నారో, ఇప్పటి నుండే కెరిర్ గైడెన్స్ పై అవగాహన కల్పించే ఉద్దేశంతో విద్యా ఉద్యోగ సమాచారం కోసం ఈ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఇది ఎంతగానో విద్యార్థులకు ఉపయోగపడతాయని అన్నారు. ఉపాధ్యాయులందరూ బాలబాలికల్లో అంతర్గతంగా దాగి ఉన్న టాలెంట్ను గుర్తించి, వారిలో విద్యా ప్రమాణాలు మరింత పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా తర్ఫీదు ఇవ్వాలని, పదో తరగతి పరీక్షలలో ఉత్తీర్ణులు అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, తదుపరి కోర్సులపై వారికి పూర్తిగా అవగాహన కల్పించాలని అన్నారు. విద్యార్థినిలు తప్పనిసరిగా పదవ తరగతి కాగానే ఒక గోల్ ఏర్పాటు చేసుకొని సామర్థ్యాలను పెంచుకోవాలని, ప్రతిరోజు పాఠశాలల్లో పెట్టిన చార్టులు గమనించి వాటిలోని సారాంశాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటి సాధనకు ఇప్పటినుంచే ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. చాలా మంది విద్యార్థులు భవిష్యత్తులో ఏమి కాదల్చుకున్నారో చాలా విపులంగా చెప్పారని, చాలా సంతోషం మీ తల్లిదండ్రులు మీ మీద ఎంతో నమ్మకముతో మీ భవిష్యత్తు బాగుపడాలని కాయకష్టం చేసుకుంటూ మిమ్మల్ని చదివిస్తున్నారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి కోరిక నెరవేర్చాలని తెలిపారు. నేను చదువుకునే రోజుల్లో నా యొక్క గోలు పైలెట్ కావాలని అనుకునేవాడినని, కానీ ఎనిమిదో తరగతి వరకు చదివే రోజులలో ఐఏఎస్ ఆఫీసర్ మా పాఠశాలకు రావడం వలన ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ఐఏఎస్ కావాలని అనుకున్నానని, కానీ అనుకోని సమయంలో విద్యుత్ శాఖలో ఏఈగా విధులు నిర్వహించానని, నా యొక్క స్నేహితుని సలహా వలన ఆయన ఇచ్చిన స్ఫూర్తితో నేను ఐఏఎస్ ప్రిలిమినరీ పరీక్షలు రాసి ఐఏఎస్ గా సెలెక్ట్ అయ్యానని, కావున విద్యార్థిని విద్యార్థులు ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి అనుకున్నది సాధించే వరకు పట్టుదలగా చదివి మంచి ఉద్యోగాలు సాధించుకొని జీవితంలో స్థిరపడాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఏవో, స్పెషల్ ఆఫీసర్ సున్నం రాంబాబు, ఏసిఎంఓ రమణయ్య, ఏటీడీఓ అశోక్ కుమార్, ఎంఈఓ సమ్మయ్య, తాసిల్దార్ అశోక్ కుమార్, ఎంపీడీవో రామకృష్ణ, హెచ్ఎంలు నరసింహారావు, బట్టు రాములు, సోమశేఖర్, నరేందర్, సర్వేశ్వర దొర, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవి పేట పాఠశాలకు డిజిటల్ ప్రొజెక్టర్ అందించిన ప్రియనేస్తం ట్రస్ట్ ఫౌండర్ పింగిలి నాగరాజు

# ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి

- పింగిలి నాగరాజు సేవలు అభినందనీయులు - మధ్యాహ్న భోజన కార్మికులకు డ్రెస్ కోడ్

- పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించాలి - ప్రభుత్వ పాఠశాలలో నమోదు శాతం పెంచాలి

- వెంకటాపూర్ తహసిల్దార్ గిరిబాబు

వెంకటాపూర్ ( రామప్ప ), మార్చి 3 ,(ప్రజా కలం:–

సోమవారం రోజున ప్రభుత్వ పాఠశాలలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వెంకటాపూర్ తహసిల్దార్ గిరిబాబు అన్నారు మండలంలోని లక్ష్మీదేవి పేట మండల ప్రజా పరిషత్ పాఠశాలకు నేస్తం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు పింగిలి నాగరాజు రూ.25000 లు విలువచేసే ఆల్ ఇన్ వన్ డిజిటల్ ప్రొజెక్టర్ను సోమవారం భోజన విరామ సమయంలో అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తాసిల్దార్ గిరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల కోసం నాణ్యమైన విద్యను అందించేందుకు పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తుందని అన్నారు. లక్ష్మీదేవి పేటలో ని పాఠశాలకు డిజిటల్ బోధన కోసం ఉపాధ్యాయులు కోరగానే ప్రియనేస్తం ట్రస్ట్ ఫౌండర్ పింగిలి నాగరాజు ప్రొజెక్టర్ను అందించడం అభినందనీయమని అన్నారు. ములుగు జిల్లాలో నిరుపేద విద్యార్థుల అభ్యున్నతి కోసం నాగరాజు చేస్తున్న సేవలు మరువలేనివని ఆయన కొనియాడారు. పాఠశాలలో చదివే విద్యార్థులు నిరుపేద కుటుంబాల నుంచి వచ్చే వారిని వారికి విలువలతో కూడిన విద్యను అందించి వారి అభివృద్ధికి కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా ఉపాధ్యాయులను కోరారు.



పాఠశాలలో చదివే విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని ఇందుకుగాను ప్రతి పాఠశాలలో ఒక రిజిస్టర్ ఏర్పాటు చేసి అందులో వివరాలను నమోదు చేయాలని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో వెంకటాపూర్ మండలంలో ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు మధ్యాహ్నం భోజనము వండి పెట్ట మహిళలకు డ్రెస్ కోడ్ ఏర్పాటు చేస్తానని ఇందుకుగాను స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సహకరించాలని ఆయన కోరారు. ప్రియనేస్తం ట్రస్ట్ ఫౌండర్ పింగిలి నాగరాజు మాట్లాడుతూ లక్ష్మీదేవి పేట పాఠశాల దినదినం అభివృద్ధి చెందుతుందని విద్యార్థుల నమోదుకు ఉపాధ్యాయులు ఎంతగానో కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు.

రానున్న రోజుల్లో గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని ఆయన సూచించారు. తన వంతుగా విద్యార్థులకు ఎలాంటి అవసరం ఉన్న అవసరం తీర్చేందుకు తాను ముందు ఉంటానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల నమోదు శాతం పెంచడంలో కృషి చేస్తున్నారని అన్నారు. అందుకు నిదర్శనమే ఎంపీపీ ఎస్ లక్ష్మీదేవి పేట పాఠశాల అని ఆయన తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తున్నామని ప్రతిరోజు సాయంకాలం వ్యాయామ విద్యను సైతం ప్రోత్సహిస్తూ క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందిస్తున్నామని ఆయన తెలిపారు. తమ పాఠశాలలో చదివే విద్యార్థులు పాఠశాలకు రానిచో వారి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులను రెగ్యులర్గా పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగాపూర్ ప్రధానోపాధ్యాయులు ఎండి సర్వర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ విజేందర్, మాదిగ కార్యకర్త అలుగోది శ్రీకాంత్, సీనియర్ ఉపాధ్యాయులు నలేంద్రం, సాంబయ్య, అంగన్వాడీ టీచర్ మద్దెల సంధ్య, ఆయా స్వరూప విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.


## గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక రాష్ట్ర అధ్యక్షులు గొల్లపెల్లి సత్యం గౌడ్ కు సన్మానం

-గుల్లకోట గౌడ సంఘం, అమరగొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో



ఎండపల్లి, మార్చి 03 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామం లో సోమవారం రోజున మర్రి మండువ దగ్గర గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక రాష్ట్ర కమిటీ నూతన అధ్యక్షులు గా నియమితులై నందుకు గొల్లపెల్లి సత్యం గౌడ్ కు సన్మాన మహోత్సవానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు సముద్రాల తిరుపతి అనిల్ పాల్గొనగా గౌడ సంఘం సభ్యులు అమరగొండ సత్య నారాయణ ఆధ్వర్యం లో గొల్లపెల్లి సత్యం గౌడ్ కు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు రాష్ట్ర అధ్యక్షులు గొల్లపెల్లి సత్యం గౌడ్ మాట్లాడుతూ గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు ఇక్కడ అవకాశాలు తక్కువ ఉండి గల్ఫ్ వెళ్తే అక్కడ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని వస్తాం కాని మనకు సహాయం చేయడానికి ఇండియా ఏంబాసి ఉండదు ఏ దేశంలో అయినా ఇండియా ఎంబిసి ఉండాలని గల్ఫ్ లో చనిపోయిన వారిని కూడా ఇండియాకు ఇంటికి తీసుకు రావడానికి కూడా ఎన్నో రోజులు పడుతుంది అందుకే మనకంటూ ఒక ఇండియా ఎంబాసి ఉండాలని గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక ఉండాలని ఒక్క సంస్థను దోనికేని క్రిష్ణ స్థాపించాడు నిర్మల్ టు హైదరాబాద్ దాకా ఎన్నారై పాలసీ రావాలని పాదయాత్ర కూడా చేశాడు. అందులో భాగంగానే గుల్లకోట నుండి నేను కూడా పాదయాత్రలో పాల్గొన్నాను వారితో పాటు గుల్లకోట యువకులు కూడా చాలామంది పాదయాత్రలో పాల్గొన్నారు ఇంతకు ముందు నేను జగిత్యాల జిల్లా అధ్యక్షులుగా ఉన్నాను నా వంతు కృషినీ ఇతరులకు సహాయం చేసే గుణం ఉన్న వ్యక్తిని అని తెలిపారు దొనికేని క్రిష్ణ నన్ను గుర్తించి నాకు రాష్ట్ర అధ్యక్షులు గా నన్ను నియమించారు నేను సౌదీలో ఉన్నప్పుడు చాలామందికి సహాయం చేశాను అది కాక చనిపోయిన వారిని కూడా యజమానిని సౌదీలో కపిల్ అంటాం ఆ కపిల్ దగ్గరికి వెళ్లి చనిపోయిన వారిని ఇండి యాకు రప్పించడం కోసం ఎవరికైనా ఇబ్బందులు ఉన్నవారికి ఆ కపిల్ దగ్గరకు పోయి వారి గురించి కపిల్ తో మాట్లాడడం చాల మందికి సహాయం చేశాను అది కాక మన విలేజ్ పక్కకు ఉన్న కొండాపూర్ లో అయితే ఒక వ్యక్తి మస్కట్లో చనిపోయి ఆరు నెలల వరకు ఇండియాకు తన శవాన్ని తీసుకు రాలేదు అందులో నేను చొరవ తీసుకొని చనిపోయిన వ్యక్తిని ఇండియాకు రప్పించడమే కాకుండా గుల్లకోట యువకులు, నేను నా వంతు సహాయం అందించాం ఇప్పుడు నన్ను గుర్తించి రాష్ట్ర అధ్యక్షులుగా నియమించినందుకు ధోనికేని క్రిష్ణకు ధన్యవాదాలు తెలుపుతు న్నాను ఈ కార్యక్రమం లో గౌడ సంఘం సభ్యులు అమరగొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు గొల్లపెల్లి సత్యం గౌడ్ ను శాలువాతో సన్మానించినట్లు అమరగొండ సత్యనారాయణ తెలిపారు.

## రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మార్చ్ 03: నిజామాబాద్ జిల్లాలో ఏసీబీ సోదాలు కలకలం రేపాయి. నిజామాబాద్ అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం ఉదయం అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు.

కాగా ఓ సబ్ రిజిస్ట్రార్ ను విచారిస్తున్నట్లు తెలిసింది. అర్బన్ కార్యాలయం పరిధిలో ప్రస్తుతం ఇద్దరు రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు పని చేస్తున్నారు. అయితే డాక్యుమెంట్ల వెనుక పెద్ద ఎత్తున వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రత్యేకించి పార్టీ రిజిస్ట్రేషన్ల కోసం తాము అడిగినంత చెల్లిస్తేనే ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. లేదంటే కొర్రీలు పెడుతున్నారు. దీంతో పలువురు బాధితులు ఏసీబీని ఆశ్రయించినట్లు తెలుస్తోంది తనిఖీలకు సంబంధించిన పూర్తి వివరాలు ఏసీబీ అధికారులు త్వరలో వెల్లడించనున్నారు.



## కొడుకులు, కోడళ్లపై కలెక్టర్ కు ఫిర్యాదు

నిజామాబాద్ : జిల్లా ప్రతినిధి మార్చి 03 (ప్రజా కలం)

నవీపేట్ మండలం కోసి ఫకీరాబాద్ గ్రామానికి చెందిన గుడ్డి ముత్తమ్మ అనే వృద్ధురాలు కొడుకులు, కోడళ్లు పట్టించుకోవడం లేదని సోమవారం ప్రజావాణిలో నిజామాబాద్ కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. భర్త చనిపోతే అక్కున చేర్చుకుని కడుపు నింపాల్సిన కొడుకులు, కోడళ్లు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో దేవాలయం ఎదుట కూర్చుని యాచిస్తూ జీవనం సాగిస్తున్నానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

## సీనియర్ నేషనల్స్ హాకీ పోటీలకు తూంపల్లి క్రీడాకారిణి

నిజామాబాద్ : జిల్లా ప్రతినిధి మార్చి 03 (ప్రజా కలం)



సీనియర్ నేషనల్స్ హాకీ పోటీలకు సిరికొండ మండలం తూంపల్లి క్రీడాకారిణి మమత ఎన్నికైనట్లు అధ్యాపకులు తెలిపారు. ఇటీవల జింఖానా గ్రౌండ్ లో నిర్వహించిన సీనియర్ నేషనల్ హాకీ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. జాతీయస్థాయి హాకీ పోటీలు మార్చి 2 నుంచి 10వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో జరగనున్నాయి. ఈ సందర్భంగా క్రీడాకారిణిని పలువురు అభినందించారు.

# చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా పటిష్ట చర్యలు




నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి)మార్చ్ 03:

చివరి ఆయకట్టు వరకు పంటలకు సాగు నీరు అందేలా ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. సోమవారం ఆమె యాసంగి పంటలకు సాగు నీటి సరఫరా, నీటి పారుదల శాఖ పనితీరు పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. యాసంగి పంటలకు రాబోయే పది రోజులు చాలా కీలకమని, అధికారులు అప్రమత్తంగా ఉంటూ సాగు నీరు, విద్యుత్తు సరఫరా అవసరమైన మేర పంట పొలాలకు చేరేలా చూడాలని, సాగు రంగానికి నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భారీ నీటి పారుదల శాఖ పరిధిలోని రిజర్వాయర్లలో అవసరమైన మేర సాగునీరు అందుబాటులో ఉందని, పంటలకు సమృద్ధిగా నీరు విడుదల చేయడం జరుగుతుందని, విడుదల చేసిన నీరు చివరి ఆయకట్టు వరకు చేరేలా అధికారులు సమర్థవంతమైన పర్యవేక్షణ చేయాలని అన్నారు. యాసంగి లో 77 లక్షల ఎకరాలలో సాగు జరుగుతోందని, ముఖ్యంగా వరి పంట 54.82 లక్షల ఎకరాల సాగు జరిగిందని, గత సంవత్సరం కంటే 2 లక్షల 70 వేల ఎకరాలు వరి, లక్ష ఎకరాల మొక్కజొన్న పంట అధికంగా సాగు అవుతోందని తెలిపారు.

సిద్దిపేట, జనగామ, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి, వనపర్తి. తదితర జిల్లాలలో కొన్ని సమస్యలు ఉన్నాయని, వీటిని పక్కగా పర్యవేక్షిస్తూ పంటలు ఎండిపోకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రాజెక్టుల నుంచి విడుదల చేసిన ప్రతి నీటి చుక్కను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ కలెక్టర్లకు సూచించారు. ఎస్సారెస్పీ, ఎస్సారెస్పీ స్టేజి 2, నాగార్జున సాగర్, ఏఎంఆర్ లిఫ్ట్, కల్వకుర్తి , ఇతర ప్రాజెక్టుల కింద నిర్దేశిత ఆయకట్టుకు సాగునీరు అందాలని సీఎస్ సూచించారు. రాబోయే 10 రోజుల్లో క్షేత్రస్థాయి నుంచి వచ్చే డిమాండ్ కు అనుగుణంగా సాగునీరు విడుదల చేస్తూ, రైతుల పొలాలు ఎండిపోకుండా కాపాడాలని సిఎస్ ఆదేశించారు. ఎత్తిపోతల పథకాలకు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఎక్కడ లోటు రాకుండా చూసుకోవాలని సీఎస్ డిస్కం అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఉన్న పీక్ డిమాండ్ కు మరో 10 నుంచి 15 శాతం పెరిగినా తట్టుకునెలా విద్యుత్ వ్యవస్థ సన్నద్ధంగా ఉండాలని సీఎస్ సూచించారు.

కాగా, రాష్ట్రంలో ఉన్న గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో కలెక్టర్, అదనపు కలెక్టర్ ల తనిఖీ తర్వాత పరిస్థితులలో మార్పులు వచ్చాయని, పిల్లలకు అందించే ఆహార నాణ్యత పెరిగిందని, కామన్ మెనూ డైట్ పక్కాగా అమలు అవుతుందని అన్నారు. సింగిల్ యూసెజ్ ప్లాస్టిక్ నిషేధంకు సంబంధించి ప్రజలను భాగస్వామ్యం చేస్తూ, ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేలా చర్యలు తీసుకోవాలని సిఎస్ తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, వ్యవసాయ, ఇరిగేషన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





## పేకాట స్థావరంపై ప్రత్యేక బృందాల దాడి:

నిజామాబాద్ : జిల్లా ప్రతినిధి మార్చి 03 (ప్రజా కలం)

నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్, స్పెషల్ పార్టీ సిబ్బంది సోమవారం దాడి చేసినట్లు టాస్క్ ఫోర్స్ CI అంజయ్య తెలిపారు. విఠలేశ్వర నగర్ రైస్ మిల్ పక్కన నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై రైడ్ చేసి ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. 3 సెల్ ఫోన్లు, రూ.2450 నగదు, 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని తదుపరి చర్య నిమిత్తం రూరల్ పోలీస్ స్టేషన్ SHO కు అప్పగించారు.

## ప్రజావాణికి 62 ఫిర్యాదులు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి)మార్చ్ 03:

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 62 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీఓ శ్రీనివాస్, నిజామాబాద్ ఏ.సీ.పీ రాజా వెంకట్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండిరగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## పానీపూరి డబ్బులు అడిగాడని కత్తితో దాడి



నిజామాబాద్ : జిల్లా ప్రతినిధి మార్చి 03 (ప్రజా కలం)

ఓ వ్యక్తి పానీపూరి తిని.. రూ.10 డబ్బులు అడిగిన సదరు చిరు వ్యాపారిపై కత్తితో దాడి చేసిన ఘటన నిజామాబాద్లో ఆదివారం రాత్రి జరిగింది. నగరంలోని శంకర్ భవన్ స్కూల్ వద్ద చిరు వ్యాపారి ఆకాశ్ పానీపూరీ బండి నడిపిస్తున్నారు. హర్మీత్ సింగ్ అనే వ్యక్తి అక్కడికి వచ్చి పానీపూరి తిన్నాడు. అనంతరం ఆకాశ్ డబ్బులు అడిగాడు. 'నన్నే డబ్బులు అడుగుతావా' అంటూ హర్మీత్ సింగ్ చిన్న చాకుతో ఆకాశ్ వేళ్ళు కోశాడు.

## బోధన్ రూరల్ సీఐపై ప్రజావాణిలో ఫిర్యాదు

నిజామాబాద్ : జిల్లా ప్రతినిధి మార్చి 03 (ప్రజా కలం)

మహిళపై దాడి చేసిన బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబుపై చర్యలు తీసుకోవాలని రెంజల్ మండలం జూపల్లి గ్రామానికి చెందిన భోగి భాగ్య సోమవారం నిజామాబాద్ కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్కి ఫిర్యాదు చేశారు. గత నెల 13న లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాల్లో ఆమె పర్సు పోవడంతో పోలీస్ అవుట్ పోస్టులో ఫిర్యాదు చేశానన్నారు. అక్కడే ఉన్న సీఐ విజయ్ బాబు తన మాట వినిపించుకోకుండా లాఠీతో బాదాడని ఆవేదన వ్యక్తం చేశారు.





## కొల్తూరు గ్రామంలో బిస్మిల్లా హలీం షాప్ ను ప్రారంభించిన మాజీ ఉపసర్పంచ్ జైపాల్ రెడ్డి

శామీర్ పేట, మార్చ్ 03 ( ప్రజా కలం ప్రతినిధి ) :

మూడు చింతలపల్లి మండలం కొల్తూరు గ్రామంలో రంజాన్ స్పెషల్ సందర్భంగా జగన్ గూడా గ్రామ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు ఆదిల్ బిస్మిల్లా హలీం షాప్ ను ఆదివారం ముఖ్యఅతిథిగా కొల్తూరు గ్రామ మాజీ ఉపసర్పంచ్ జైపాల్ రెడ్డి ఆహ్వానించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... రంజాన్ పండుగ ముస్లిం సోదరులకు చాలా పెద్ద పండుగని వారు 41 రోజు ఉపవాస దీక్షలతో ఉండి రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకుంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కొల్తూరు గ్రామం మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరసింహారెడ్డి, జగన్ గుడా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రవీందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వీరారెడ్డి, నరసింహారెడ్డి, స్వామి, ప్రవీణ్, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు పునరావృత్తం కాకుండా వెంటవెంటనే పరిష్కరించాలి

### -జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

మేడ్చల్ జిల్లా: కలెక్టరేట్, మార్చ్ 03 ( ప్రజా కలం ప్రతినిధి ) :

ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులు పునరావృత్తం కాకుండా వెంటవెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను లా ఆఫీసర్ చంద్రావతి, డిఆర్ఓ హరిప్రియల తో కలిసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (100) ఫిర్యాదులు అందాయన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ........ దరఖాస్తులు పెండింగ్ లో ఉండటం వలన అభ్యర్థులు మళ్లీ మళ్లీ




దరఖాస్తు చేసుకోవడం జరుగుతుందని, ఇట్టి విషయాన్ని జిల్లా అధికారులు గమనించి, దరఖాస్తులు పునరావృత్తం కాకుండా వెంట వెంటనే పరిష్కరించాలని జిల్లా అధికారులను అదనపు కలెక్టరు ఆదేశించారు. వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు పోస్టర్ ను జిల్లా అధికారులతో కలిసి అదనపు కలెక్టరు విడుదల చేసారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసింది:కూన శ్రీశైలం గౌడ్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద రోజువారి కార్యాచరణలో భాగంగా నియోజకవర్గం ప్రజలతో కలిసి వారి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు ఆహ్వానాలు, వినతిపత్రాలు స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈసందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పెద్దపీట వేసిందన్నారు.మహిళల అభ్యున్నతి కోసం మన ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందాన్నారు. నియోజకవర్గంలో ఉన్న స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా అన్నారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గం ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు..

## ఇసుక డంపు సీజ్ చేసిన పోలీసులు




వలిగొండ మార్చి 3 ప్రజాకలం:మండల పరిధిలోని వేములకొండ గ్రామంలో మూసి నది పరీవాహక ప్రాంతం నుండి ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలించి వ్యాపారం చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి సుమారు 40 టన్నుల ఇసుక డంపును సీజ్ చేసి,ఇసుకను అక్రమంగా తరలించి డంప్పు ఏర్పాటు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై యుగంధర్ సోమవారం తెలిపారు.



# సిఐటియులో చేరిన సెంట్రింగ్ కార్మికులు

## కార్మిక హక్కుల కోసం కార్మిక చట్టాల అమలు కోసం పోరాడేది సిఐటియు సంఘమే:కీలుకానీ లక్ష్మణ్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

కుత్బుల్లాపూర్ మండలం వివిధ బస్తీలలోని సెంట్రింగ్ కార్మికులు సిఐటియు షాపూర్ నగర్ కార్యాలయంలో సిఐటియు కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు కీలుకాని లక్ష్మణ్ సమక్షంలో సీఐటీయూలో చేరారు. ఈసందర్భంగా కీలుకానీ లక్ష్మణ్ మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ మండల పరిధిలో సెంట్రింగ్ కార్మికులు సిఐటియు నాయకత్వం మీద ఉన్న నమ్మకంతో సంఘంలో చేరడం జరిగిందన్నారు. సెంట్రింగ్ కార్మికులకు గుత్తేదారుల నుంచి, బిల్డర్స్ నుంచి గాని ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సిఐటియు సంఘం వాళ్లకు అండగా ఉంటుందని తెలిపారు. వాళ్ళ సమస్య పరిష్కారంలో భాగస్వామ్యం అవుతామని, ఇప్పటికే, భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికుల విషయంలో పని ప్రదేశంలో ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే స్పందించి ప్రమాదం జరిగిన కార్మికులకు నష్టపరిహారం ఇప్పించడం జరుగుతుందని గుర్తు చేశారు. భవన నిర్మాణ కార్మికులకు పేరుకే వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వడంతోనే అధికారులు చేతులు దులిపేశారని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు గుర్తింపు కార్డులు ఉన్న ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు మొత్తం దళారులమయమైందన్నారు. నిరక్షరాస్యులైన భవన నిర్మాణ కార్మికులను దళారులు, సంక్షేమ బోర్డు అధికారులు దోపిడీ చేస్తున్నారని, వందల కోట్ల రూపాయలు కార్మికుల సంక్షేమం కోసం కాకుండా ప్రభుత్వ అవసరాలకు వాడుకుంటు నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు మొండి చేయి చూపిస్తున్నారని దుయ్యబట్టారు. పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు సంవత్సరాలు గడిచిన పరిహారం అందడం లేదని ఏదైనా ఒకరిద్దరికి వచ్చిన డబ్బుల్లో నుంచి దళారులకే సగం పోతున్నాయన్నారు. మరణించిన కార్మికుడి కుటుంబానికి సగం డబ్బులు వస్తున్నాయని వెంటనే ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఇల్లు ఇళ్ల స్థలాలు రేషన్ కార్డులు పెన్షన్లు మంజూరు చేయాలని ఈసందర్భంగా డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సెంట్రింగ్ కార్మిక సంఘం నాయకులు కృష్ణ, మధు, దిగంబర్, చంద్రకాంత్, దీపక్, మారుతి, కిషోర్, రవి, కరీం, రోషన్, సుధా, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నలు ఆత్మస్థైర్యంతో ఉండాలి



తుర్కపల్లి, మార్చి 03(ప్రజా కలం ప్రతినిధి)

రైతులు, ప్రజలు ఆత్మస్థైర్యంతో ఉండాలని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. సోమవారం తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న రైతు మంద రామచంద్రయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామచంద్రయ్య మృతి చెందడం బాధాకరమని అన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రైతులు, ప్రజలు ఆత్మహత్యలతో సమస్య పరిష్కారం కాదని అన్నారు . ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, జిల్లా ఓబీసీ కార్యదర్శి దేవరుప్పల ఐలయ్య ,మండల ఓబీసీ సెల్ అధ్యక్షులు రామగోని వెంకటేష్, యూత్ అధ్యక్షుడు వల్లపు రమేష్, నాయకులు కరుణాకర్ రెడ్డి, వెంకటేష్ గుప్తా, వంగ నారం రెడ్డి, వీరంతల గోవింద చారి, అలకుంట్ల ప్రవీణ్, రామగోని మహేష్, బేతాళ శివ, చేవర్తి నరసింహులు, బరిగే వీరయ్య, కొంతం కృష్ణ, శ్రవణ్ కుమార్, చీకోటి కృష్ణ, బాబుపేట వెంకటేష్, కానుగంటి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు

# వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

## "మత్స్యావతారంలో నరసింహుడు........."

## " యాదాద్రి క్షేత్రంలో బ్రహ్మోత్సవ అలంకార వైభవం.........."





యాదగిరిగుట్ట, మార్చ్ 3
( ప్రజా కలం ప్రతినిధి )

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం మూడో రోజు నారసింహుడు మత్స్యావతారంలో కనువిందు చేశారు. ముల్లోకాలను రక్షించే దేవదేవుడి అవతారాల్లో మొట్టమొదటి మత్స్యావతారాన్ని భక్తులు తరించారు. విశ్వశాంతి, లోక కల్యాణం కోసం లక్ష్మీనరసింహుల తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో అలంకార సేవలు నిర్వహించడం ఆలయ సంప్రదాయం. వివిధ రకాల పుష్పాలు, బంగారు, ముత్యాల ఆభరణాలతో దివ్య మనోహరంగా అలంకృతులైన స్వామివారి అలంకార సేవ ప్రధానాలయ ఉత్సవ మండపంలో భక్తులకు కనువిందు చేసింది. అలంకార మూర్తులకు వేద పారాయణాలు, మూల మంత్ర జపాలతో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. రుత్వికులు, అర్చకులు, వేదపండితుల పారాయణాలు, మంగళవాయిద్యాలతో స్వామివారిని ఆలయ తిరువీధులలో ఊరేగించారు. అనంతరం బ్రహ్మోత్సవ మండపంలో అధిష్ఠింపజేసి దుష్టశిక్షణ, శిష్టరక్షణకు, ముల్లోకాలను రక్షించడానికి స్వామివారి మత్స్యావతార విశేషాలను ఆచార్యులు వివరించారు. రాత్రి శేషవాహనంపై దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు బాలాలయ మండపంలో విహారింప జేశారు.లక్ష్మీ సమేత నరసింహుడు ఆదిశేషుడి పడగనీడలో శయనించగా భక్తజనులు దర్శించుకుని తరించారు. వేడుకలను పాంచరాత్రాగమశాస్త్రరీతిలో ప్రధానార్చకులు నల్లన్‌థిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, ఆధ్వర్యంలో అర్చకబృందం, వేదపండితులు నిర్వహించారు. వైదిక పర్వాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో భాస్కరరావు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## భిక్కనూర్ లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు...

ఎల్లారెడ్డి మార్చ్ 03 ప్రజా కలం ప్రతినిధి : ఎల్లారెడ్డి మండలంలోని భిక్కనూర్ గ్రామంలో గత వారం రోజుల నుండి ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నట్లు ఫీల్డ్ అసిస్టెంట్ భాగయ్య




తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులలో భాగంగా గ్రామ పొలిమేరల్లోని స్మశాన వాటిక మీదుగా నూరుగంటిరాళ్ల ప్రాంతం వరకు ఫార్మేషన్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ ఉపాధి హామీ పనులను సోమవారం స్థానిక పంచాయతీ కార్యదర్శి స్వప్న పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఫీల్డ్ అసిస్టెంట్ నిర్ణయించిన కొలతల మేరకు పనులు చేపట్టాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ గోనె శ్రీకాంత్, కారోబార్ రాజు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల కుటుంబాలకు మార్చి 9న రాందేవ్ అస్పత్రి లో ఉచిత వైద్య శిబిరం

### మార్చి 5 లోపు పేర్లు నమోదు చేసుకోవాలి

### టియుడబ్ల్యు జె జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు

కూకట్ పల్లి, మార్చి 03, ప్రజా కలం ప్రతినిధి:

జర్నలిస్టుల కుటుంబాల ఆరోగ్య భద్రత కోసం రాందేవ్ రావు ఆస్పత్రి ఆధ్వర్యంలో చేయనున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ నెల 9 న కూకట్ పల్లి వివేకానంద నగర్ లోని అస్పత్రి ప్రాంగణం లో వైద్య శిబిరం జరుగుతుందన్నారు. నిత్యం ఉరుకుల పరుగుల జీవితంలో వార్త సేకరణల కోసం ఎన్నో ఒత్తిడి లకు గురవుతూ జర్నలిస్టులు అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా భవిష్యత్తులో వచ్చే అనారోగ్య సమస్యలను తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రాందేవ్ రావు ఆస్పత్రి యాజమాన్యం జర్నలిస్టులతో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించడమే కాకుండా సంబంధిత డాక్టర్లతో పర్యవేక్షణ చేయించేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. వైద్య పరీక్షలలో గుండె, కిడ్నీ, లివర్ లకు సంబంధం ఉన్న అన్ని రకాల రక్త పరీక్షలు, ఎముకల కు సంబందించిన పరీక్షలు, షుగర్, క్యాన్సర్ స్క్రినింగ్, మహిళలకు అన్ని రకాల గైనిక్ పరీక్షలు, కండ్లు, దంతాల పరీక్షలతో కలిపి సుమారు రూ. 30 వేల ఖర్చుతో కూడిన వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. వైద్య పరీక్షలు చేసుకోదలచినవారు మార్చి 5వ తేదీ లోపు తమ పేరు, కుటుంబ సభ్యుల వివరాలు, పత్రిక పేరు, ఫోన్ నెంబర్ నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. మర్చి 9 న ఆదివారం ఉదయం 6 గంటల నుంచి వైద్య పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జర్నలిస్టులు అందరు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా నిమ్మల సంతోష్ రావు జన్మదిన వేడుకలు

కూకట్ పల్లి, మార్చి 03, ప్రజా కలం ప్రతినిధి:

బిఆర్ఎస్ యువ నాయకుడు నిమ్మల సంతోష్ రావు జన్మదిన వేడుకలను కార్యకర్తలు, అభిమానుల మధ్య సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు కూకట్ పల్లి



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంతోష్ రావు కు శాలువా కప్పి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కృష్ణారావు చేతుల మీదగా పారిశుద్ధ కార్మికులు, పేద మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో నిమ్మల సంతోష్ రావు కీలక పాత్ర పోషించి యువతను ప్రోత్సహించారని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ పటిష్టత కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, బిఆర్ఎస్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు, మాధవరం రంగారావు, గొట్టుముక్కల పెద్ద భాస్కరరావు, కార్తీక్ రావు స్థానిక నాయకులు సందీప్ ముదిరాజ్, చారి తదితరులు పాల్గొన్నారు.

## సృజనాత్మకతను వెలికి తీసే వేదిక సైన్స్ ఫెయిర్ కార్పొరేటర్ అరుణ సురేందర్ యాదవ్

నాగోల్ మార్చి 3(ప్రజా కలం )

విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీసే వేదిక విజ్ఞానమేళ అని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని హరిహర గ్రామ హైస్కూల్లో నిర్వహించిన సైన్స్ ఫేయిర్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కూడా కష్టపడి చదివి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు సమాజానికి మంచి పేరు తేవాలని సూచించారు. పాఠశాలలో ఇలాంటి సైన్స్ ఫెయిర్ నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత బయటపడుతుందని అన్నారు. ఇలాంటి వేదికలను విద్యార్థులు సద్వినియోగించుకోవాలని సూచించారు. ఈ ఈ వైజ్ఞానిక మేళలో విద్యార్థులు రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ నమూనాను, బ్లూటూత్ కారు మొదలైన ఎగ్జిబిట్స్ సూపర్ లను ఆకర్షించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సూరం రామ్ రెడ్డి వైస్ ప్రిన్సిపాల్ మమతారెడ్డి స్కూల్ ఇన్చార్జ్ కవిత ఉపాధ్యాయులు ఎల్బీ రావు తదితరులు పాల్గొన్నారు.




## బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ దృష్టికి బోయినిపల్లి మార్కెట్ సమస్యలు

### తాగునీరు, మురుగునీటి సమస్య తీర్చండి మార్కెట్ యంత్రాంగం



కంటోన్మెంట్: మార్చ్ 3 ప్రజాకలం ప్రతినిధి

బోయిన్ పల్లి మార్కెట్ గురించి ప్రత్యేకంగా చెప్పానక్కర లేదు. ఎంత మంచి పేరు ఉందో అన్ని సమస్యలు కూడా ఇక్కడ దర్శనమిస్తాయి. ఎన్నో ఏళ్లుగా పేరుకు పోయిన సమస్యలను పరిష్కారం చేసేందుకు మార్కెట్ యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. ఇన్నాళ్లు సమస్యలతో జీవనం సాగించిన వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా చేసేందుకు శ్రీకారం చుట్టారు. సికింద్రాబాద్ బోయిని పల్లి మార్కెట్ లో ఉన్న తాగునీటి, మురుగునీటి సమస్యకు పూర్తి స్థాయిలో చెక్ పెట్టినట్లే అని మార్కెట్ చైర్మెన్ ఆనంద్ బాబు, వైస్ చైర్మెన్ దేవేందర్ వివరణ ఇచ్చారు. ఈ సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ, కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ తో భేటీ అయ్యారు. మార్కెట్ లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. అన్ని విషయాలను పూర్తిగా చర్చించిన తర్వాత బోర్డు పరిధిలో ఉన్న నియమాలకు లోబడి తాగునీరు, మురుగు నీరు నిర్వహనకు పరిష్కారం చూపుతామన్నారు. మరోవైపు మార్కెట్ నుండి రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఫన్ను వెల్లుతుందని మార్కెట్ కమిటి వెల్లడించింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ ఆనంద్ బాబు, వైస్ చైర్మెన్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వినికిడి సమస్యలపై అవగాహన పెంచుకోవాలి - మంత్రి కొండా సురేఖ

### మా ఈఎన్టీ ఆసుపత్రిలో ప్రపంచ వినికిడి దినోత్సవ వేడుకలు

### వినికిడి సమస్యను గుర్తిస్తే నివారణ చేయడం సులువు:మంత్రి కొండ సురేఖ







హైదరాబాద్: మార్చ్ 3 ప్రజాకలం ప్రతినిధి

ఆధునిక యుగంలో పెరుగుతున్న శబ్ద కాలుష్యం వల్ల వినికిడి సమస్యలు విపరీతంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా చిన్నారుల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుందని పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం నగరంలోని మా ఇ ఎన్ టీ హాస్పిటల్లో నిర్వహించిన ప్రపంచ వినికిడి దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తల్లిదండ్రులు చిన్నారుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నతనంలోనే జాగ్రత్తలు తీసుకుంటే భవిష్యత్తులో వినికిడి సమస్యలను అధిగమించవచ్చని స్పష్టం చేశారు.

అలాగే, పేదలకు సహాయం చేసే సంస్థలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మా ఇ ఎన్ టీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె. ఆర్. మేఘనాథ్ మాట్లాడుతూ, ప్రజల్లో వినికిడి సమస్యలపై అవగాహన కల్పించేందుకు తమ ఆసుపత్రి ప్రతి ఏడాది ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తోందని తెలిపారు. మా ఇ ఎన్ టీ హాస్పిటల్లో ఇప్పటివరకు 700 కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించామని, ముందుగా సమస్యను గుర్తిస్తే వినికిడి లోపాన్ని పూర్తిగా అరికట్టవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో, రెండు సంవత్సరాలు నిండిన పిల్లలందరికీ ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మా ఇ ఎన్ టీ హాస్పిటల్ చైర్మన్ సునీత జీ కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని నాలుగు వేల శిశువులకు ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పిల్లల్లో ముందుగానే వినికిడి సమస్యలను గుర్తించడం అత్యవసరమని, దీనివల్ల తగిన చికిత్సను సమయానికి అందించవచ్చని ఆమె వివరించారు. కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలలో ఎటువంటి వైఫల్యాలు లేని ఆసుపత్రిగా మా ఇ ఎన్ టీ హాస్పిటల్ నిలిచింది అని సునీత జీ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుజిత రెడ్డి, డాక్టర్ ముర్తుజా, డాక్టర్ లక్షిత్, ప్రముఖ ఆడియాలజిస్ట్ వికాస్ నేతృత్వంలోని రీహాబిలిటేషన్ బృందం పాల్గొన్నారు. ఈ సందర్బంగా పిల్లలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



## వేద పండితులతో ఘనంగా హోమం



సిద్దిపేట జిల్లా ప్రజాకలం ప్రతినిధి మర్చి 03.

రాయపోల్ మండల పరిధిలోని ముంగాజిపల్లి ఎస్సీ కాలనీలో శ్రీ శ్రీ పోచమ్మ ముత్యాలమ్మ ఉత్సవ మహోత్సవాలు సోమవారం రోజున ఘనంగా నిర్వహించారు. ఉదయం 9-00 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనము, శ్రీశ్రీశ్రీ పోచమ్మ - ముత్యాలమ్మ వారికి పంచామృతంతో అభిషేకం, అలంకారణ మరియు 11-00 గంటలకు హోమం, మంగళహారతి తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. హోమం మీద గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. దాదాపుగా 28 జంటలు పాల్గొన్నారు. శంకర్ పంతులు ఆధ్వర్యంలో ఐదుగురు పంతులతో ఈ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించడం జరిగిందన్నారు. నేడు అమ్మవారికి బోనాలు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.




## హాట్ సమ్మర్ లో బింగ్సూస్ కు రండీ

### హాట్ సమ్మర్ లో బింగ్సూస్ మిమ్మల్ని కూల్ చేస్తుంది -యజమాని మేకల పూజ

కొత్తపేట, మార్చి 3(ప్రజా కలం ):

కొత్త పేట్ డివిజన్ పరిధిలోని ఓంమ్ని హాస్పిటల్ సమీపంలో చందన హెూటల్ ని ఆనుకోని నూతనంగా ఏర్పాటు చేసిన బింగ్సూస్ (ట్రీట్ యువర్ సెల్ఫ్ ) ప్యూర్ వెజిటేరియన్ ఐస్క్రీమ్ పార్లర్ ను యజమాని మేకల పూజ సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఇక్కడ ఈ హాట్ సమ్మర్ లో బింగ్సూస్ మిమ్మల్ని వందశాతం కూల్ చేస్తుందని ఐస్క్రీమ్ పార్లర్ నిర్వాహకులు పూజా తెలిపారు. అన్నిరకాల ఫ్లేవర్స్ తో సరసమైన ధరలకే అన్ని రకాల ఐస్ క్రీం లు,బర్గర్, పిజ్జా,స్నాక్స్, మిల్క్ షేక్స్ అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ప్రామాణికమైన, నాణ్యత కలిగిన రుచి, సుచి తో కస్టమర్ల కి తక్కువ ధరలలో అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానిక ప్రజలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా : ఎంపీ ఈటెల రాజేందర్



మేడ్చల్ జిల్లా: శామీర్ పేట / మార్చ్ 03 ( ప్రజా కలం ప్రతినిధి ) :

జర్నలిస్టుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ అన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా టియుడబ్ల్యూజే అధ్యక్ష, కార్యదర్శులు గడ్డమీది బాలరాజు, దొంతుల వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ను జిల్లా కమిటీ సభ్యులతో కలిసి టీయూడబ్ల్యూజే రాష్ట్ర, మేడ్చల్ జిల్లా డైరీ ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....... మేడ్చల్ జిల్లాలోని జర్నలిస్టు లందరి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యలను తాను పార్లమెంటులో సైతం లేవదీసిన విషయాన్ని గుర్తు చేశారు. నిరంతరం వార్తలు సేకరిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పరితపించే జర్నలిస్టుల సంక్షేమం బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.

మేడ్చల్ జిల్లాలోని జర్నలిస్టులందరితో తాను త్వరలోనే ప్రత్యేకంగా సమావేశం అవుతానని, అందుకు తగు ఏర్పాటు చేయాల్సిందిగా మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షుడు పి విక్రం రెడ్డి కీ చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి మోతె వెంకటరెడ్డి, స్టేట్ కౌన్సిల్ సభ్యులు మల్కయ్య, హరినాథ్, జిల్లా కమిటీ సభ్యులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, మల్లారెడ్డి, విజయ్,ఏవి శ్రీధర్ రావు, గంగరాజు, రాజుగల్ల భూపాల్, క్యాతం రవి, పల్ల మహేందర్ రెడ్డి , కూకుట్ల నరోత్తం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# శృతి మించుతున్న 'ప్రీ వెడ్డింగ్ షూట్స్'

- ఆసుపత్రులు, స్మశానాలు, బురదలో, రోడ్లపై, నదులు, జలపాతాల వద్ద ఫోటో షూట్స్
- మొదట్లో పట్టణాలలో ఉన్న ఈ సంస్కృతి ఇప్పుడు పల్లెలకూ పాకింది
- ఉత్తరఖాండ్ లో నదిలో ఫోటో షూట్స్ చేస్తూ ఓ జంట నీటి ప్రవాహానికి గల్లంతు
- పెళ్ళికి ముందే 'కట్టు తప్పుతున్న' నూతన వధూవరులు
- ఇది మంచి సాంప్రదాయం కాదంటున్న ఆధ్యాత్మికవేత్తలు...
- ఆడపిల్ల తల్లిదండ్రులకు తడిసి మోపెడవుతున్న ఖర్చు

ప్రజా కలం ప్రత్యేకం..



**హైదరాబాద్, ఎల్లారెడ్డి మార్చ్ 03 ప్రజా కలం ప్రతినిధి :**

పెళ్లి ఖర్చు ఓ వైపు ఆకాశాన్ని అంటితే కల్యాణం పేరుతో కొన్ని పెడపోకడలు కూడా ప్రవేశిస్తున్నాయి. ముఖ్యంగా ప్రీ వెడ్డింగ్ షూట్, ఫోటో షూట్‌ల పేరుతో జరుగుతున్న హంగామా కొన్ని సార్లు హద్దులు దాటుతోంది. అన్ని మతాల్లోనూ అత్యంత పవిత్రమైన ఘట్టమైన పెళ్లి తంతు అసహ్యంగా కూడా మారుతోంది. కొందరు ఆసుపత్రులు, శ్మశానాలు, బురదలో షూట్ చేయించు కుంటున్నారు. నదులు, సముద్రాలు, కొండలు వంటి ప్రదేశాల్లో షూట్ చేయించుకుంటూ కొందరు ప్రాణాలు కోల్పోయిన ఉదంతాలూ ఉన్నాయి.

**రకరకాల లొకేషన్లలో ఫోటో, వీడియో షూట్ :**

పెళ్లంటే జీవితంలో ఒక్కసారి మాత్రమే జరిగే కార్యక్రమం. ఈ జ్ఞాపకాన్ని కలకాలం దాచుకోవాలని ఒకప్పుడు ఫోటోలు, వీడియోలు తీయించుకునే వారు. అయితే ఇప్పుడు ఆ




పరిధి దాటి ఫోటో షూట్, ప్రీవెడ్డింగ్‌లు వచ్చేశాయి. పెళ్లి చేసుకోబోయే జంట కొన్ని రోజుల ముందే ఏదైనా అందమైన ప్రదేశానికి వెళ్లి ఫోటో షూట్ జరిపించుకుంటున్నారు. ఆ వీడియోను పెళ్లి రోజు పెద్ద వీడియో తెరలపై ప్రదర్శిస్తున్నారు. మొదట్లో పట్టణాలలో ఉన్న ఈ సంస్కృతి ఇప్పుడు పల్లెలకూ పాకింది. ఇటీవలి కాలం వరకు పెళ్లి రోజు ఫ్లెక్సీ పెట్టించడానికి రెండు, మూడు రోజుల ముందు వధూ వరులు ఫోటో దిగేవారు. ఇదే ఆధునీకరణ చెందుతూ ప్రీవెడ్డింగ్ షూట్‌గా మారింది. ఫోటోలకే పరిమితం కాకుండా సినిమా పాటలకు డాన్స్ చేస్తూ రకరకాల లొకేషన్లలో వీడియో షూట్ చేయించుకుంటున్నారు.

**ఇతరుల కంటే భిన్నంగా ఉండాలనే తాపత్రయం...**

ప్రీ వెడ్డింగ్ షూట్‌ల ద్వారా పెళ్లిని ఎప్పటికీ గుర్తుండిపోయేలా చేసుకోవాలని భావించడంలో తప్పు లేకున్నా ఇటీవల కాలంలో అది కట్టుతప్పడమే ఆందోళన కల్గిస్తోంది. ఇవి ఒక్కోసారి శృతి మించుతున్నాయి. ఇతరుల కంటే భిన్నంగా ఉండాలనే తాప త్రయంతో కొందరు ఆసుపత్రులు, శ్మశానాలు, బురదలో సైతం షూట్ చేయించుకుంటున్నారు. శ్మశానం అంటే కీడుగా భావిస్తుంటారు. అయితే పవిత్రమైన పెళ్లికి సంబంధించిన ఘట్టాన్ని అక్కడ జరిపించుకుంటూ దీన్ని అపవిత్రంగా మారుస్తున్నారు. హైదరాబాద్‌లో ఓ పోలీసు తన భార్యతో కలిసి స్టేషన్‌లో పోలీస్ వాహనం ముందు ఈ తరహా షూట్ చేయడం సంచలనమైంది. ఇద్దరూ పోలీసులే కావడం, శుభ కార్యం కావడంతో అధికారులు పెద్దగా పట్టించుకోలేదు. ప్రమాదకర ప్రదేశాల్లో ఫోటో షూట్ జరిపించుకుంటూ ప్రాణాలు కోల్పోయిన వారూ ఉన్నారు. ఉత్తరాఖండ్‌లో ఓ జంట నదిలో ఫోటో షూట్ చేయటానికి వెళ్లి అకస్మాత్తుగా నీటి మట్టం పెరగడంతో కొట్టుకుపోయారు.

**వేలం వెర్రిగా ప్రీ వెడ్డింగ్ షూట్...**

ఒకప్పుడు పెళ్లి అంటే అమ్మాయిలు సిగ్గుతో తల ఎత్తుకునే వాళ్లే కాదు అనే మాట తరచూ వింటూనే ఉంటాం. నిజంగానే పెళ్లిళ్లు ఒకప్పుడు అలాంటి పద్ధతుల్లో జరిగేవి. పెళ్లి కూతురుగా ముస్తాబైన తర్వాత అలంకరణ చెదిరిపోతుందని, లేక ఇంకా వేరు వేరు కారణాలతో పెళ్లి కూతురును పెద్దవారు ఇంటి నుంచి బయటకు రానిచ్చేవారు కాదు. కానీ ఇటీవల యువతులు పెళ్లికూతురు ముస్తాబులో ఏకంగా బుల్లెట్ బైక్ నడుపుతూ చక్కర్లు కొడుతూ ఆ



వీడియోలను మీడియాలో వైరల్ చేస్తున్నారు. ప్రీ వెడ్డింగ్, హల్దీ, మెహందీ, పోస్టు వెడ్డింగ్, బేబీ బంప్ వీడియోలు షూట్ చేసుకోవడం సాధారణంగా మారిపోయింది. మితీమీరనంత వరకు ఏదైనా మంచిదే అంటున్నారు నిపుణులు. ప్రీ వెడ్డింగ్ అనేది వేలం వెర్రిగా మారుతోందంటున్నారు.

**నవ దంపతుల మధ్య కెమిస్ట్రీ ఉండాలంటూ ప్రీవెడ్డింగ్...**

కొందరు పెళ్లి ఆడంబరాల కోసం చేస్తున్న ఖర్చులు వృథాగా ఆధ్యాత్మిక వేత్తలు అభి వర్ణిస్తున్నారు. ఆ క్షణం చేసిన ఏర్పాట్లు, పెట్టిన ఖర్చు ఎందుకు పనిరాదని హితవు పలుకు తున్నారు. ప్రీవెడ్డింగ్ షూట్‌లు, ప్రత్యేకమైన థీమ్స్‌లో జరుగుతున్న తతంగం కొన్నిచోట్ల అసహ్యంగా సాగుతోందని, క్లోజ్‌గా మూవ్ కావాలంటూ ఇంకా పెళ్లికాని యువతీ యువకులపై ఒత్తిడి తీసుకురావడం అనుకోని ఇబ్బందులకు కారణమవుతోందని వారిస్తున్నారు. కెమిస్ట్రీ ఉండాలంటూ ప్రీవెడ్డింగ్ వేడుకల సందర్భంగా చేస్తోన్న సూచనలను, తల్లిదండ్రులే గట్టిగా నియంత్రించాలే తప్ప పౌరసమాజం కాదని వారు అంటున్నారు.

**అప్పులు తెచ్చి మరీ అట్టహాసంగా పెళ్లిల్లు....**



తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం పేద, మధ్య తరగతి కుటుంబాలు సైతం కట్న కానుకలు కాకుండా ఒక పెళ్లికి సగటున రూ. 10 లక్షలకుపైగా అప్పులు చేసి ఖర్చు పెడుతున్నాయి. ఈ క్రమంలోనే ఖర్చులు హద్దులు దాటి, పేద మధ్య తరగతి కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నాయి. అందువల్ల వీరు హంగులు, ఆర్భాటాలకు వెళ్లకుండా, అప్పుల పాలు కాకుండా పెళ్లిళ్లు చేస్తేనే మేలనే వాదన వినిపిస్తోంది. యువత కూడా ప్రీ వెడ్డింగ్ షూట్ పేరుతో అసహ్యం కల్గించే రీతిలో కాకుండా హద్దుల్లో ఉంటే మేలని ఆధ్యాత్మికవేత్తలు సూచిస్తున్నారు.

**ప్రీ వెడ్డింగ్ షూట్ అనేది అశుభం : ఆధ్యాత్మికవేత్తలు**

ప్రీ వెడ్డింగ్ షూట్ తరువాత అనుకోని పరిస్థితిలో వివాహం ఆగిపోతే అప్పుడు అమ్మాయి పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు కూడా వస్తున్నాయి. ఈలోగా ప్రీవెడ్డింగ్ దృశ్యాలు సోషల్ మీడియాలోకి వస్తే ఆ తరువాత అమ్మాయి పెళ్లి ఇబ్బంది అవుతుందనే వాదన ఉంది. ప్రీ వెడ్డింగ్ షూట్‌ల కోసం చేస్తున్న ఆడంబర ఖర్చులన్నీ వృథా అనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. వీటి కోసం ఆర్థిక సాయం చేసేందుకు ఫైనాన్స్ కంపెనీలు పుట్టుకొచ్చి అదో పరిశ్రమగా మారుతోంది. వీడియో ఫోటోలకు 10 నుంచి 15 లక్షల రూపాయల వరకు వదిలించు కుంటున్నారని ఊటీ వరకు వెళ్లి ఫోటోషూట్‌లు తీయించుకుంటూ తల్లి తండ్రిని భారీగా లూటీ చేస్తున్నారని సున్నితంగా మందలిస్తున్నారు. అంత ఖర్చు చేసి వివాహాలు చేస్తున్నందునే నవ దంపతుల మధ్య అహం పెరిగి రెండు, మూడేళ్లకు విడిపోతున్న ఉదంతాలున్నాయని నిపుణులు అంటున్నారు. పెళ్లి కాకుండా ప్రీ వెడ్డింగ్ షూట్ అనేది అశుభం అని ఆధ్యాత్మికవేత్తలు అంటున్నారు.



# భవిష్యత్ తరాలతోనే భావిభారతం

**మంచి చదువుతోనే పేదరికం పోతుంది**

**గొప్ప ఆలోచనలే గొప్ప వ్యక్తులను తయారు చేస్తాయి**

**నైపుణ్య శిక్షణలో లీడ్ ఇండియా అధినేత సూచనలు**

**మాజీ ఎమ్మెల్యే, లీడ్ ఇండియా అధినేత కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి**




మహేశ్వరం, మర్చి 03,(ప్రజా కలం)

మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం కన్న కలలను నిజం చేయాలంటే నేటి విద్యార్థులు భవిష్యత్ పారిశ్రామిక వేత్తలు, రాజకీయ నాయకులు, ప్రముఖ వ్యక్తులుగా మారాలని మాజీ ఎమ్మెల్యే, లీడ్ ఇండియా అధినేత శ్రీ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు.సిద్దిపేట జిల్లా కుకునూర్ మండలం యల్లాయిగూడలోని విజయలక్ష్మీ మెమోరియల్ స్టోన్ బ్రిడ్జి స్కూల్ లో జరిగిన నైపుణ్య శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై.. విద్యార్థులకు పలు సూచనలు చేశారు కేఎల్ఆర్. పేదరికం పోవాలన్నా చదువు ఒక్కటే మార్గమని లక్ష్మారెడ్డి సూచించారు. గొప్ప గొప్ప చదువులు చదివి విదేశాలకు పోకుండా మన దేశానికి సేవ చేసి... అగ్రదేశాల నిపుణులు సైతం భారత్ కు వచ్చి పని చేసేలా చేయాలని భవిష్యత్ తరాలకు లక్ష్మారెడ్డి సూచించారు.ఈ స్కూల్ లో తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఉచితంగా విద్యనందించటం అభినందనీయమని యాజమాన్యాన్ని కిచ్చెన్న కొనియాడారు.విజయానికి పేదరికం అడ్డుకాదన్న కేఎల్ఆర్ మంచి ఆలోచనలు, పాజిటివ్ థృక్పథంతో ముందు వెళ్లాలని సూచించారు. ఏదైనా సాధించాలన్న తపన చిన్నతనం నుంచే ఉండాలని దానిపై ధ్యాస పెట్టి రోజూ మననం చేసుకోవాలని పుస్తకాల్లో రాసుకోవాలని విద్యార్థులకు కిచ్చెన్నగారు తెలిపారు.ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సైతం వారిలో ఉన్న నైపుణ్యాలను గుర్తించి ఆదిశగా ప్రోత్సాహించాలని కేఎల్ఆర్ కోరారు. ఈ కార్యక్రమంలో లీడ్ ఇండియా ప్రతినిధులు, స్కూల్ యాజమాన్యం, టీచర్లు పాల్గొన్నారు. కేఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా లక్షల మంది విద్యార్థులకు లీడ్ ఇండియా నైపుణ్య శిక్షణ ఇవ్వటం సంతోషమని టీచర్లు అన్నారు.

# కరాటేలో సత్తా చూపిన అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్

**- సుమన్ తల్వార్ లెజెండరీ ఆధ్వర్యంలో 2025 కప్ కరాటే పోటీలు**

**గోల్డ్, సిల్వర్, కాంస్యం పథకాలను గెలుచుకున్న విద్యార్థులు**

**విద్యార్థుల పట్ల హర్షం వ్యక్తం చేసిన ఛైర్మెన్ తిరుపతి రెడ్డి,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు**

**మహేశ్వరం, మర్చి 03,(ప్రజా కలం )**

మహేశ్వరం.నియోజకవర్గం పరిధిలోని ఏ హెచ్ పి ఎస్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్) బడంగ్‌పేట్ విద్యార్థుల కరాటేలో సత్తా చాటారు.ఇటీవల జరిగిన సుమన్ తల్వార్ లెజెండరీ కప్ 20 25 కరాటే పోటీలలో వివిధ విభాగాలలో పాల్గొని పలువురు విద్యార్థులు పతకాలు సాధించారు.అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ (ఏ హెచ్ పి ఎస్) బడంగ్‌పేట్ పాఠశాల



ఛైర్మన్ తిరుపతి రెడ్డి, డైరెక్టర్స్ మధుకర్ రెడ్డి కౌశిక్ రెడ్డి ,ప్రిన్సిపాల్ మాధవి రెడ్డి మేడం,మరియు కరాటే శిక్షకుల ఆధ్వర్యంలో విద్యార్థులు సాధించిన పథకాలు గోల్డ్ -14 సిల్వర్ 8-18, కాంస్యం -23 ఇంకా చాలా మంది విద్యార్థులు వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. విద్యార్థుల ప్రతిభను పాఠశాల ఛైర్మన్ తిరుపతి రెడ్డి డైరెక్టర్స్ మధుకర్ రెడ్డి,కౌశిక్ రెడ్డి, ప్రిన్సిపాల్ మాధవి రెడ్డి,కరాటే శిక్షకులు ప్రశంసించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ మా పాఠశాల విద్యార్థులు కరాటేలో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. వారి విజయాలు మాకు గర్వకారణం విద్యార్థులకు కరాటే శిక్షణ ఇచ్చిన శిక్షకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ మాధవి రెడ్డి,మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో కష్టపడి ఈ విజయాలు సాధించారు. వారి కృషి, పట్టుదల అభినందనీయం" అని అన్నారు.విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లల విజయాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. కరాటే శిక్షణ విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని, శారీరక ధృఢత్వాన్ని పెంపొందించడానికి దోహదపడుతుందని వారు పేర్కొన్నారు.ఈ విజయంతో అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ బడంగ్‌పేట్ పాఠశాల విద్యార్థులు కరాటేలో తమ సత్తాను మరోసారి నిరూపించారని గావించారు.




Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **Kalakonda Ramakrishna**, Printed at M/s. Swetha Offset Printers, H.No. 2-10-92, Weekly Bazar, Boigally, Nizamabad-503001, Telangana State and Published from H.No. 2-10-92, Weekly Bazar, Boigally, Nizamabad-503001, Telangana State, Editor: **Kalakonda Ramakrishna**, RNI. Regn.No. TELTEL/2010/33275, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com